రాకాసి అల.. తీరం విలవిల


కోతకు గురైన జగ్గరాజుపేట గ్రామం


సూరాడపేట గ్రామాన్ని తాకుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సముద్రతీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. రాకాసి అలలు తీరప్రాంత గ్రామాలను తాకడంతో పలుచోట్ల చెట్లు నేలకూలాయి. ఉప్పాడ, మాయాపట్నం, సూరాడపేట, జగ్గరాజుపేట, కోనపాపపేట గ్రామాల్లో గృహాలు కోతకు గురై నేలకూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కెరటాల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉండడంతో తీర ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. ఉప్పాడ నుంచి నేమాం వరకు రహదారి వెంబడి కెరటాల తీవ్రత అధికంగా ఉంది. రక్షణ రాళ్లను ఢీకొని నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఎస్‌ఈజెడ్ పరిశ్రమ సమీపంలో ఉన్న ఓ వంతెన పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. -న్యూస్‌టుడే, కొత్తపల్లి

సహకారం.. సాంకేతిక అస్త్రం

- పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు చర్యలు
- 298 కేంద్రాల కంప్యూటరీకరణకు కసరత్తు


బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు.. వందల కోట్ల కుంభకోణాలు.. లెక్కలేనన్ని తప్పులు..ఇదీ ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి. కంప్యూటర్ యుగంలోనూ ఆర్థిక లావాదేవీలన్నీ కాగితాల రూపంలో జరగడమే కారణం.. దీంతో పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు కేంద్రం ఉపక్రమించింది. కంప్యూటరీకరణ ద్వారా వ్యవస్థలను అనుసంధానం చేసి.. పత్రరహిత పాలనతో అక్రమాలకు అడ్డుకట్ట వేయనుంది.

కాకినాడలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) పరిధిలోని 52 శాఖల్లో సాంకేతికతతో ఆర్థిక లావాదేవీలు సాగుతున్నాయి. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాల్లోని 298 పీఏసీఎస్‌లలో నేటికీ లావాదేవీలు, రుణాల వివరాలు కాగితాల రూపంలోనే భద్రపరుస్తున్నారు. రాష్ట్ర, జిల్లా సహకార బ్యాంకులతో పీఏసీఎస్‌లు అనుసంధానం కాక.. రోజువారీ వ్యవహారాలపై పర్యవేక్షణ కష్టమవుతోంది. దీంతో తప్పుడు పత్రాలు జతచేసి రుణాలు పొందడం వంటి అక్రమాలు జరిగాయి.

ఇప్పటికీ కాగితాల రూపంలోనే..

◆ ఉమ్మడి జిల్లాలో 148 పీఏసీఎస్‌లు నష్టాల్లో ఉన్నాయి. రూ.949.98 కోట్ల రుణాలు గడువు మీరినా చెల్లించని పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావం డీసీసీబీపై పడింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.248.26 కోట్ల నష్టాన్ని చవిచూసింది. పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రభుత్వం నుంచి రూ.300 కోట్లు, నాబార్డు నుంచి 3 శాతం వడ్డీకి రూ.500 కోట్ల రుణాన్ని డీసీసీబీ కోరింది. 2029 నాటికి వ్యవస్థను లాభాల్లోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది.


కాకినాడలోని కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం



ఈనాడు, కాకినాడ

● పైలట్ ప్రాజెక్టు కింద..

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానానికి చర్యలు చేపట్టింది. పైలట్ ప్రాజెక్టు కింద కాకినాడ జిల్లాలో నరవ, గొల్లప్రోలు.. కోనసీమలో వీరవల్లిపాలెం, అమలాపురంలోని కేవీరావు పీఏసీఎస్, తూర్పులో తొర్రేడు.. అల్లూరి జిల్లాలో ఇందుకూరు పేట పీఏసీఎస్‌లను ఎంపికచేసినా ఏవీ కొలిక్కిరాలేదు. వీటితోపాటు అన్ని సంఘాల కంప్యూటరీకరణను మరో 15 రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేయొచ్చు



పీఏసీఎస్‌లలో పత్ర రహిత సేవలతో.. అక్రమాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. సాంకేతికతతో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతుంది. ఏరోజుకారోజు లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేసి పరిస్థితి సమీక్షించొచ్చు. పీఏసీఎస్‌లకు కంప్యూటర్, 13 రకాల పరికరాలు పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలో డేటా ఎంట్రీ 70 శాతం పూర్తయింది. కంప్యూటరీకరణ నెలాఖరుకు కొలిక్కివస్తుంది. -ఆర్.వి.నరసింహారావు, సీఈవో, డీసీసీబీ

2 మార్గాలు.. 4 వరుసలు

కాకినాడ-జొన్నాడ; కాకినాడ-ధవళేశ్వరం రహదారుల విస్తరణకు పచ్చజెండా


బిక్కవోలు-బలభద్రపురం మధ్య కెనాల్‌రోడ్డు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యంత రద్దీగా ఉండే రెండు ప్రధాన రహదారుల విస్తరణకు అడుగులు పడనున్నాయి. కాకినాడ-జొన్నాడ, కాకినాడ-ధవళేశ్వరం కెనాల్‌రోడ్డు అభివృద్ధికి బాటలు వేయనున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 17 ప్రధాన రహదారులను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద బాగుచేయాలని సంకల్పించింది. అందులో ఈ రెండు రాష్ట్ర రహదారులకు చోటు కల్పించారు. వీటిని నాలుగు వరుసలుగా మార్చనున్నారు. కెనాల్ రోడ్డు విస్తరణకు భూసేకరణ పూర్తవగా, బాధితులకు పరిహారం చెల్లించారు. కాకినాడ-జొన్నాడ రోడ్డు భూసేకరణకు నిధులివ్వాల్సి ఉంది. ఈ మేరకు ప్రతిపాదనలను ఆర్‌అండ్‌బీ కాకినాడ సర్కిల్ అధికారులు ప్రభుత్వానికి పంపారు.

కెనాల్ రోడ్డు ఇలా..

కాకినాడ-ధవళేశ్వరం మధ్య సామర్లకోట, బిక్కవోలు, అనపర్తి, ద్వారంపూడి మీదుగా కెనాల్‌రోడ్డు ఉంది. 2010లో అప్పటి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.300 కోట్లు మంజూరు చేయించింది. కాకినాడ-సామర్లకోట వరకు నాలుగు వరుసలు, వేట్లపాలెం నుంచి వెడల్పు తగ్గించి రహదారి విస్తరణ పనులను ఒక సంస్థకు అప్పగించింది. ప్రాథమిక దశలోనే ఈ సంస్థ చేతులెత్తేసింది. తాజా ప్రతిపాదనల్లో మొత్తం రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేలా ప్రతిపాదించారు. దీని కోసం పదేళ్లుగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోరాడుతున్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లారు.

భూసేకరణే సవాలు

కాకినాడ-జొన్నాడ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. హైదరాబాద్, విజయవాడల నుంచి రావులపాలెం, మండపేట, రామచంద్రపురం, కాకినాడ ప్రాంతాలకు వచ్చే వాహనాలకు ఈ మార్గం కీలకం. పీపీపీ విధానంలో విస్తరణకు పచ్చజెండా ఊపినా భూసేకరణ పెద్ద సవాలు. పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. కొన్నిచోట్ల బైపాస్ రోడ్లు ప్రతిపాదించారు. ఆర్‌అండ్‌బీ కాకినాడ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ జి.కంఠు మాట్లాడుతూ నిధులు వస్తే రెండు, మూడేళ్లలో ఈ రెండు రహదారుల పనులు పూర్తవుతాయని తెలిపారు.

రాష్ట్ర రహదారి	పొడవు (కి.మీ)	ప్రస్తుత వెడల్పు (మీటర్లు)	విస్తరణ తర్వాత వెడల్పు (మీటర్లు)	అవసరమైన నిధులు (రూ.కోట్లు)
కాకినాడ- జొన్నాడ	53	7	16	1,500
కాకినాడ- ధవళేశ్వరం	68.3	7	16	1,200

తుని రైల్వేస్టేషన్‌లో మంటలు

ఆందోళనకు గురైన ప్రయాణికులు


ప్లాట్‌ఫామ్‌పై మంటల వ్యాప్తి..

తుని: తుని రైల్వే స్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్‌ఫామ్‌పై బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. సాయంత్రం 5.45 గంటల సమయంలో ప్లాట్‌ఫామ్ ఫ్లోరింగ్‌పై భూగర్భ విద్యుత్తు తీగలకు సంబంధించి షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే సమయంలో విశాఖపట్నం వెళ్లే జన్మభూమి రైలు రావడం.. హడావిడిలో ఉన్న ప్రయాణికులు ఈ మంటలు చూసి పరుగులు తీశారు. రైల్వే ఎలక్ట్రికల్ విభాగ సిబ్బంది మంటలు ఆర్పేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగలేదని స్టేషన్ సూపరింటెండెంట్ రఘునాథ్ బెహ్రా తెలిపారు.

నయా కిక్కు

- తెరుచుకున్న మద్యం దుకాణాలు
- ఉమ్మడి జిల్లాలో రూ.27.80 కోట్ల సరకు విక్రయాలు

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానం ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లైసెన్సులు దక్కించుకున్నవారంతా బుధవారం నుంచి దుకాణాలను ప్రారంభించారు. తమకు అవసరమైన సరకును నిర్దేశిత ఐఎంఎల్ డిపోల నుంచి తీసుకువచ్చారు. 375 దుకాణాల నుంచి వచ్చిన ఇండెంట్ల ఆధారంగా రాజమహేంద్రవరం, సామర్లకోట, అమలాపురం, చాగల్లులోని డిపోల నుంచి సుమారు రూ.27.80 కోట్ల విలువైన మద్యం సరఫరా చేశారు. అందుబాటులో ఉన్న నిల్వలు, గిరాకీ ఆధారంగా దాదాపు 40 వేల కేసుల మద్యం (కేసుకు 9 లీటర్లు) అందించారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటు ప్రక్రియ పూర్తికాకపోవడంతో షామియానాలు ఏర్పాటుచేశారు.


సర్పవరంలో ఆరుబయటే మద్యం విక్రయాలు

రద్దీ వాతావరణం..

● రాజమహేంద్రవరంలోని ఐఎంఎల్ డిపో నుంచి బుధవారం 74 దుకాణాలకు రూ.6.73 కోట్ల (లిక్కరు 7393, బీర్లు 2164 కేసులు) విలువైన మద్యం సరఫరా చేశారు. ఇక్కడి నుంచే కోనసీమ జిల్లా పరిధిలోని 42 దుకాణాలకు సైతం పంపిస్తున్నారు.
● చాగల్లు డిపో పరిధిలో తూర్పుగోదావరి జిల్లాలో 42, ఏలూరు-28, భీమవరానికి చెందిన 40 దుకాణాలున్నాయి. ఇక్కడి నుంచి బుధవారం రాత్రి 9 గంటల వరకు 96 దుకాణాలకు రూ.4.20 కోట్ల విలువైన మద్యం కేసులు సరఫరా చేశారు. ● కాకినాడ జిల్లా పరిధిలో 155 దుకాణాలుండగా 118 దుకాణాలకు రూ.11.28 కోట్ల (లిక్కరు 11,797, బీర్లు 5458 కేసులు) విలువైన మద్యం పంపించారు.
● అమలాపురం డిపో పరిధిలో 92 దుకాణాలుండగా 72 దుకాణాలకు రూ.5.6 కోట్ల (లిక్కరు 6056, బీర్లు 1956 కేసులు) విలువైన మద్యం విక్రయించారు. సాంకేతిక సమస్య కారణంగా అందరికీ సరకు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ● కొన్ని దుకాణాల్లో గత ప్రభుత్వానికి చెందిన బ్రాండ్లను రూ.150 నుంచి రూ.220 చొప్పున విక్రయించడంపై కొందరు ప్రశ్నించారు. మద్యం డిపోల్లో ఇప్పటికీ పాత స్టాకు ఉండడం, కొత్త బ్రాండ్లు కూడా రావడంతో ఇలా జరిగి ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

అటో.. ఇటో..



విద్యుత్తు స్తంభాలు ఓవైపు వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. కాలువనీటి ప్రవాహానికి మట్టి కిందకు దిగిపోయి స్తంభాలు వాలిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయపడుతున్నారు. సామర్లకోట మండలం కెనాల్ రోడ్డులో హుస్సేన్‌పురం వద్ద విద్యుత్తు స్తంభాలు ఓపక్కకు వాలి ఉన్నాయి. ఈ మార్గంలో రోజూ వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. తీవ్రగాలులు, తుపాన్ల సమయంలో పడిపోయే అవకాశం ఉందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే సరిచేయాలని, లేదంటే ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ

బియ్యం అక్రమాలకు 'చెక్'పోస్టులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదల బియ్యం అక్రమంగా విదేశాలకు తరలిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ జరగట్లేదనే విమర్శలు ఉన్నాయి. నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. భూ సంబంధిత సమస్యలు అనేకం ఉన్నాయి. వీటన్నింటికి పరిష్కారం చూపిస్తామని, ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా స్పష్టం చేశారు.

ముమ్మర తనిఖీలు చేస్తున్నాం..

కాకినాడ పోర్టు వద్ద రెండు చెక్‌పోస్టులు పెట్టాం. ఇక్కడ మూడు షిఫ్టుల్లో సిబ్బంది పహారా కాస్తున్నారు. ప్రతి లారీని తనిఖీ చేస్తున్నారు. నమూనాలు పరిశీలించాకే అనుమతిస్తున్నాం. గేట్ పాస్ జారీ తర్వాతే బియ్యం లోడుతో ఉన్న లారీలు పోర్టులోకి అనుమతించేలా చర్యలు చేపడుతున్నాం. దీంతోపాటు అధికార బృందాలతో వాహనాలను ఆకస్మిక తనిఖీలు చేయిస్తున్నాం. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం. గోదాముల్లో పట్టుకున్న బియ్యానికి బ్యాంకు గ్యారంటీలు ఇచ్చాకే విడుదల చేస్తాం. చెక్‌పోస్టుల సిబ్బందిని ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు.

చౌకబియ్యం అమ్మితే చర్యలు..

గరిష్ఠంగా 95 శాతం కార్డులకు రేషన్ పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. చౌక బియ్యం ఇతరులకు అమ్మితే చర్యలు తప్పవు. కొత్త చౌక దుకాణాల ఏర్పాటు, ఖాళీల భర్తీతో ప్రజల చెంతకే సరకులు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యం బలవర్థకమైనది. వీటిని వినియోగించుకోవాలి.

277 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కేంద్రం కనీస మద్దతు ధర పెంచింది. 277 కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేస్తున్నాం. కల్లం నుంచి మిల్లుకు ధాన్యం రవాణాకు వాహనాలు సమకూర్చాం. తక్కువ ధరకు అమ్ముకోవద్దు. జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తాం. ధాన్యం కొన్న 48 గంటల్లో సొమ్ములు జమ చేస్తాం. రైతుకు నచ్చిన మిల్లుకే ధాన్యాన్ని తరలిస్తాం.


సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా

ధరల నియంత్రణకు 18 ప్రత్యేక కౌంటర్లు..

పప్పులు, వంటనూనెల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, వీటిని విక్రయిస్తున్నాం. ధరలు తగ్గేవరకు వీటిని కొనసాగిస్తాం. రైతు బజార్లు, టోకు వ్యాపార సంస్థల్లో తక్కువ ధరకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి.
● బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహిస్తాం. అక్రమ నిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ప్రభుత్వం ద్వారా ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తాం. మిల్లులు, గోదాముల్లో తనిఖీలు చేపడతాం.

భూవివాదాలపై సమీక్ష..

భూ వివాదాలు, ప్రతి సోమవారం రీ-సర్వేపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించాం. ప్రతి శనివారం సమీక్షిస్తున్నాం.

టెట్‌కు 1,137 మంది హాజరు

సాంబమూర్తినగర్ (కాకినాడ): జిల్లాలో బుధవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 1,137 మంది హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,333 మంది హాజరు కావాలి. ఉదయం పరీక్షలో 578 మంది, మధ్యాహ్నం పరీక్షలో 559 మంది హాజరయ్యారు. 196 మంది గైర్హాజరు అయినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.

20న దిల్లీకి కమిషనర్

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన ఈనెల 20న దిల్లీకి వెళ్లనున్నారు. 21, 22 తేదీల్లో బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే మోడ్రన్ టెక్నాలజీస్ ఇన్ సర్వే, రీ-సర్వే ఫర్ అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ అంతర్జాతీయ కార్యశాలలో పాల్గొంటారు. కాకినాడ నగరపాలక సంస్థ నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ - బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హేబిటేషన్స్ (నక్షా) పథకానికి ఎంపికైంది. అందులో భాగంగా రెండ్రోజులు పాటు జరిగే కార్యశాలకు హాజరు కానున్నారు. తిరిగి 23 నుంచి నగర ప్రజలకు అందుబాటులో ఉంటారు.

రూ.13 లక్షల అపరాధ రుసుము వసూలు

సాంబమూర్తినగర్ (కాకినాడ): జిల్లాలో ఈనెల 10 నుంచి 15 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రూ.13,04,120లు అపరాధ రుసుము వసూలు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ కె.శ్రీధర్ బుధవారం తెలిపారు. తనిఖీలు చేసి, నిబంధనలు పాటించని 205 వాహన యజమానులకు అపరాధ రుసుం విధించామన్నారు. 37 బస్సుల ద్వారా రూ.1,22,420, 68 గూడ్స్ వాహనాల ద్వారా రూ.4,30,080, 39 మోటారు, మ్యాక్సీ క్యాబ్‌ల ద్వారా రూ.4,77,420, 61 ద్విచక్రవాహనాల ద్వారా రూ.2,74,200 వచ్చినట్లు ఆయన వివరించారు.

కలెక్టరేట్‌లో పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ క్యాంపు కార్యాలయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ ప్రాంగణంలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలోని ధాన్యం సేకరణ విభాగంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ ఛాంబర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఛైర్మన్ తోట సుధీర్‌కు రాజధాని ప్రాంతంలో ప్రత్యేక కార్యాలయం ఉంది. అయితే కాకినాడకు చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడ ఛాంబరు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వ్యక్తిగత సిబ్బంది పరిశీలించి వెళ్లారు. దీనికి కలెక్టరేట్ ప్రాంగణంలోని పౌరసరఫరాల భవనాన్ని ఎంచుకున్నారు. గత ప్రభుత్వంలో కాకినాడకు చెందిన ద్వారంపూడి భాస్కరరెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన కూడా స్థానికంగా ఛాంబర్లు నిర్వహించారు. కాకినాడలోని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనం, ఒక హోటల్ వద్ద వీటిని ఏర్పాటు చేసి, ఇక్కడి నుంచి కార్యకలాపాలు సాగించారు. ప్రస్తుత ఛైర్మన్ తోట సుధీర్ ఇక్కడి నుంచి కార్యకలాపాలు సాగించేలా ఛాంబరు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' ఆయనను సంప్రదించగా ఖరీఫ్ ధాన్యం సేకరణకు సమయం దగ్గరపడిందని, ఇక్కడి నుంచి వీటిని పర్యవేక్షిస్తామన్నారు. అధికారులతో సమీక్షలు, రైతుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. పీడీఎస్ బియ్యం ప్రజలకు సక్రమంగా చేరేలా పర్యవేక్షిస్తామన్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని రైతులు, ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

మసీదు సెంటర్(కాకినాడ): పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం కాకినాడ మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి పురోగతి, నేరస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరగుణం పోయేలా శిక్షలు ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు, త్రీటౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

జీజీహెచ్‌లో సదుపాయాల కల్పనకు కృషి

మసీదు సెంటర్ (కాకినాడ): జీజీహెచ్‌ను సమగ్ర అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, ఇతర వైద్యాధికారులతో కలిసి ఆయన బుధవారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఓపీ ఎలా ఇస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరుసలో నిల్చున్న వారితో మాట్లాడారు. అనంతరం అత్యవసర వార్డులో రోగులకు అందుతున్న సేవలు, యంత్రాల పనితీరుపై ఆరా తీశారు. వివిధ వార్డుల్లో మరుగుదొడ్లు పరిశీలించారు. వాటిని శుభ్రం చేసి, రోజూ కలెక్టరేట్‌కు చిత్రాలు పంపాలన్నారు. న్యూరో సర్జరీ, న్యూరో మెడిసిన్ విభాగాలు పరిశీలించి అవసరమైన పరికరాలు, సిబ్బంది ఖాళీల వివరాలు తెలుసుకున్నారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అవసరమైన ఎస్‌సీఎస్, ఈఈజీ యంత్రాల అవసరాన్ని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర నివేదిక తయారుచేసి, ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డా.పాండురంగ విఠల్, డా.కె.సత్యవాణి, ఆర్ఎంవో డా.కె.అనిత, డా.యమున, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

వైకాపా నాయకుల వీరంగం

ఇద్దరు తెదేపా కార్యకర్తలపై మారణాయుధాలతో దాడి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలోని దుమ్ములపేటలో ఇద్దరు తెదేపా కార్యకర్తలపై వైకాపా నాయకులు, కొందరు కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. కాకినాడ పోర్టు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్ములపేటకి చెందిన సీరం చిన్న, కాంద్ర తాతారావు చేపల వేటకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న తెదేపా సోషల్‌మీడియా విభాగం ప్రతినిధి. మంగళవారం రాత్రి స్థానిక దుర్గమ్మ గుడి వద్ద జాతర సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు చిన్న, తాతారావు భోజనాలు చేస్తున్నారు. వైకాపా కార్యకర్త, సోషల్ మీడియా ప్రతినిధి దాసరి సతీష్, ఆ పార్టీ నాయకుడు పేర్ల దుర్గారావుకు.. తాతారావుకు మధ్య కూర విషయంలో గొడవ జరిగింది. వాగ్వాదం పెరిగి అసభ్య పదజాలంతో తిట్టుకున్నారు. అదే సమయంలో సతీష్, దుర్గారావు మరికొంతమంది వైకాపా కార్యకర్తలు చిన్న, తాతారావుపై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ వారిద్దరినీ కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాసరి సతీష్, పేర్ల దుర్గారావు, వంశీ, వెంకటేష్ మరికొంతమందిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారు. వైకాపా నాయకుడు దుర్గారావు ఇదంతా చేయించారని బాధితుడు తాతారావు వాపోయారు.


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సీరం చిన్న


కాంద్ర తాతారావు

కొబ్బరి బొండాంలో మామిడి మొక్కలు



పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం కాండ్రేగుల శివారు గుబ్బల వారి పాలెంలో కొబ్బరి బొండాంలో మామిడి మొక్కలు మొలిచి ఆశ్చర్యపరుస్తున్నాయి. గ్రామానికి చెందిన పంపన సూరిబాబు, మంగయ్యమ్మ దంపతులు ఇంటిలో కొబ్బరి మొక్క నాటారు. మంగళవారం కొబ్బరి బొండాం నుంచి మామిడి మొక్కలు రావడం చూసి ఆశ్చర్యపోయారు. ఏడు మొక్కలు వచ్చినట్లు వారు తెలిపారు. దీనిపై వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్‌ను వివరణ కోరగా కొబ్బరి బొండాం పక్కనే మామిడి టెంకలు ఉంటే వాటి వేళ్ళు వృద్ధి చెంది బొండాంలోకి చొచ్చుకొనిపోయి ఉండవచ్చని తెలిపారు.

బాబా ఆలయంలో రొట్టెలు, పొత్తులు



పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణంలో షిర్డీసాయిబాబా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న సాయిబాబాను భక్తులు మొక్కజొన్న పొత్తులు, రొట్టెలతో అలంకరించారు. పట్టణంలోని శివాలయం వద్ద, పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారి, దర్గాసెంటర్‌లోని బాబా దేవాలయాల వద్దకు భక్తులు వచ్చి దర్శించుకున్నారు.

కనుల 'విందు'.. పసందు



కళాశాలలో ఏ వేడుకైనా ముచ్చటేస్తుంది..! అల్లరి చేసినా, సందడి చేసినా, కలిసి మెరిసినా కళే! కాలేజీ స్టైల్ ఏ వేడుకకు ఎలా ఉంటుందో కుర్రకారుకే ఎరుక. ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించే వేడుకలోనూ లంగా ఓణీలు, చీరల్లో మెరిసిపోవడమే కాదు.. ఎదురెదురుగా సహపంక్తి భోజనాల్లో ఎన్నో ఊసులను వడ్డించుకున్నారు. కాకినాడ జిల్లా కత్తిపూడి సీతారామా కళాశాల వేడుకలో బుధవారం విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో కను 'విందు'గా అలరించారు.

- న్యూస్‌టుడే, శంఖవరం

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ కారెం శివాజీ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి జేసీ రాహుల్‌మీనాకు వినతి పత్రం ఇచ్చారు. దళితుల భూ సమస్యలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం అందించాలని, ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, ఇల్లు, భూమి పంపిణీ చేయాలని కోరారు. దళిత ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.



జేసీ రాహుల్‌మీనాకు సమస్యలు వివరిస్తున్న శివాజీ

గుణగణాలు కీర్తించి.. పరిణయానికి ఒప్పించి!

నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం.. వామన అవతారంలో శ్రీనివాసుడి దర్శనం



వామనావతారంలో స్వామివారు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఎదుర్కోలు ఉత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయ అవరణలో అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని వెండి శేష వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు, అర్చకులు రెండు వర్గాలుగా ఏర్పడి.. ఒకరు స్వామివారి, మరొకరు అమ్మవార్ల గుణగణాలు కొనియాడి.. పెళ్లికి ఒప్పించిన తీరు భక్తులకు కనువిందైంది. ప్రత్యేక అలంకారాల్లో భాగంగా స్వామివారు వామనావతారంలో దర్శనమిచ్చారు. హనుమద్వాహనాన్ని అధిరోహించి ద్వారకాతిరుమల పురవీధుల్లో శ్రీరాముని అలంకారంలో విహరించారు. ● కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.

విల్లు ఎక్కుపెట్టి.. లక్ష్యాన్ని ఛేదించి!

పోటీల్లో పతకాలు సాధిస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే – పిఠాపురం, సర్పవరం జంక్షన్

ఆర్చరీ (విలువిద్య)లో పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపుతూ పతకాలు సాధిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడేళ్లుగా ఆర్చరీ సంఘం సభ్యులు విలువిద్యలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఏటా వేసవిలో నెలరోజులపాటు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించి, ప్రవేశాలను అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో తలపడ్డారు. అండర్-9, 14, మినీ, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ క్రీడను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో విలువిద్యకు ఆదరణ పెరుగుతోంది. తల్లిదండ్రులు కూడా పిల్లలను నేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



పిఠాపురంలో విలువిద్యలో శిక్షణ పొందుతున్న యువత

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..

నేను కాకినాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నా. ఏడాదిగా కాకినాడ జిల్లా క్రీడా శిక్షణ కేంద్రంలో రోజుకు రెండు గంటలపాటు సాధన చేస్తున్నాను. కోచ్ విజయకుమార్ సూచనలతో గతంలో జిల్లాస్థాయిలో రెండు సార్లు బంగారు పతకాలు సాధించాను. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గెలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలన్నది నా కోరిక.

- ఎండీ ఆఫ్షిన్, కాకినాడ

జాతీయ స్థాయిలో రాణించేందుకు శిక్షణ

నేను జిల్లా, రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించా. కృష్ణా జిల్లా నూజివీడు, పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన అంతర్ కళాశాలలు, యూనివర్సిటీ పోటీల్లో పతకాలు సాధించాను. పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ తలపడ్డాను. కోచ్ సహకారంతో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాలలో శిక్షణ తీసుకుంటున్నా. విల్లు, బాణాలు, టార్గెట్ బోర్డు కొనాలంటే రూ.లక్ష వరకూ ఖర్చవుతుంది. అందుకే చాలా మంది ఈ క్రీడకు దూరమవుతున్నారు.

- పి.కృష్ణ, పిఠాపురం

పోటీల్లో విజయం సాధించాలని..

నేను ఆరో తరగతి చదువుతున్నా. రోజూ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో రెండు గంటలపాటు శిక్షణ తీసుకుంటున్నాను. పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాను. తమిళనాడులో జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ పోటీల్లో ఆడాను. జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించే లక్ష్యంతో సాధన చేస్తున్నాను.

- బీహెచ్ సుహాస్, కాకినాడ

విల్లు, టార్గెట్ బోర్డులు కావాలి

ప్రభుత్వం విల్లు, టార్గెట్ బోర్డులు, బాణాలు అందిస్తే మరింత మంది క్రీడాకారులను తీర్చిదిద్దుతాం. అసోసియేషన్, విద్యార్థుల తల్లిదండ్రులు సహకారంతో ప్రస్తుతం ఈ సామగ్రి కొనుగోలు చేసి శిక్షణ ఇస్తున్నాం. ఏటా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఈ క్రీడకు ప్రత్యేక క్రీడా మైదానం అవసరం. ప్రభుత్వం సహకరిస్తే మరింత మంది జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దగలం.

- పి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఆర్చరీ సంఘం

జయశ్రీ ప్రతిభ

రూ.1.54 కోట్ల వార్షిక వేతనంతో అమెజాన్‌లో కొలువు



మల్లిపూడి జయశ్రీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కాకినాడ పట్టణానికి చెందిన మల్లిపూడి జయశ్రీ ఇటీవల అమెరికా వాషింగ్టన్ స్టేట్, సియాటిల్ పట్టణ అమెజాన్‌లో ఎస్‌డీఈ ఉద్యోగానికి ఎంపికై రూ.1.54కోట్ల వార్షిక జీతంతో ఉద్యోగం సాధించింది. కాకినాడ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన జయశ్రీ 984/1000 మార్కులు సాధించింది. ఎన్‌ఐటి తాడేపల్లి గూడెంలో బి.టెక్ కంప్యూటర్ సైన్సు కోర్సు చదివి డిస్టెన్షన్‌లో మార్కులు సాధించింది. తొలుత హైదరాబాద్ టీసీఎస్‌లో ఉద్యోగం పొందింది. అనంతరం అమెరికా దేశంలోని టెక్సాస్‌లో మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ సైన్సు చేశారు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన ఆమె ప్రఖ్యాత కంపెనీ అమెజాన్ యూఎస్ఏ సియాటిల్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్(ఎస్‌డీఈ)గా ఎంపికయ్యారు. నవంబరు 4వ తేదీన ఉద్యోగంలో చేరేందుకు ఉత్తర్వులు అందుకున్నారు. జయశ్రీ తండ్రి శ్రీనివాస్ డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండగా, తల్లి సత్యనారాయణమ్మ గృహిణి.

ఖైదీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

దానవాయిపేట, (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలోని అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ ఫైల్ చేసే విషయంలోను పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీల సమస్యలు, బెయిల్ జామీను విషయంలో తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. అనంతరం వాటిని సంబంధిత న్యాయస్థానాలకు సిఫార్సులు చేశారు. బాధితుల పరిహారాలకు సంబంధించిన అంశాలను ఆమోదించారు. ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, తూర్పు ఎస్పీ డి.నరసింహ కిషోర్, కాకినాడ, కోనసీమ ఏఎస్పీలు ఎం.జె.వి.భాస్కరరావు, ఎ.వి.ఆర్.పి.బి.ప్రసాద్, రాజమహేంద్రవరం జేసీ ఎస్.చిన్నరాయుడు, పీపీ సీహెచ్.ప్రసాద్, కొత్తపేట, అమలాపురం ఆర్డీవోలు, కేంద్ర కారాగారం మహిళా, పురుషుల జైలు అధికారులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు రఘురామ, నానాజీలపై ఫిర్యాదు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని మాల మహానాడు తరఫున జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని దిల్‌కుష్ గెస్ట్‌హౌస్‌లో జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రకు జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి అవమానించిన ఘటనలో రఘురామపైన, రంగరాయ వైద్య కళాశాల మైదానంలో దళిత వైద్యుడు ఎస్.ఉమామహేశ్వరరావుపై దాడిచేసి దూషించిన కేసులో నానాజీపైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

రైల్వే స్టేషన్‌లో భద్రతా అధికారుల బృందం తనిఖీలు

సామర్లకోట: సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ హైలెవల్ సేఫ్టీ అధికారుల బృందం విస్తృత తనిఖీలు నిర్వహించారు. బుధవారం సామర్లకోట విచ్చేసిన తనిఖీ బృందం భద్రత పరంగా అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో ఎస్ఎస్ కార్యాలయం, పార్సిల్ కార్యాలయం, నార్త్ కేబిన్, ఎల్‌సీ గేటు, సిగ్నల్ వ్యవస్థ, రిలే కార్యాలయం, స్టేషన్‌లోని అన్ని విభాగాల్లో దస్త్రసాలతిలిను తనిఖీ చేశారు. తనిఖీలో సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి వెంకట రమణారెడ్డి, చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.రవిచంద్‌తో పాటుగా తనిఖీ బృందం అధికారులు, స్టేషన్ మేనేజర్ రమేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రేపు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): ఈనెల 18 నుంచి 20 వరకు 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2024 రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజాట్యాంక్ ప్రాంగణంలోని స్కేటింగ్ రింక్‌లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్-11, 14, 17, 19 తదితర విభాగాల్లో జరుగుతాయన్నారు.

యువకుల పాలిట విషాద రేవు

● గోపులంక పుష్కరరేవులో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు

● ఆరుగురు స్నేహితుల కళ్లెదుటే నీట మునక





గోదావరిలో పడవపై గాలిస్తున్న జాలర్లు, (అంతరచిత్రం) కుతాని సాయిచంద్ర

తాళ్లరేవు, న్యూస్‌టుడే: విహారయాత్ర ఆ విద్యార్థుల్లో విషాదం నింపింది. రాజమహేంద్రవరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుతాని సాయిచంద్ర(21) గోపులంక పుష్కరరేవులో బుధవారం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. తమ కళ్ల ఎదుటే స్నేహితుడు నీటిలో మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు తేరుకోలేకపోతున్నారు. ఇదే ప్రాంతంలో ఏడాది కిందట నలుగురు మృతి చెందడం గమనార్హం.

యానాం వెళ్లి వస్తూ..

కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అఖరి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు బుధవారం కారులో యానాం విహార యాత్రకు వెళ్లారు. ఇందులో రాజమహేంద్రవరానికి చెందిన కుతాని సాయిచంద్ర, రవ్వా మంజుల్, వేంపాటి సంతోష్, నిఖిల్, తణుకుకు చెందిన మండా వంశీ, కార్తీక్, తాడేపల్లిగూడేనికి చెందిన శివరామ్ ఉన్నారు. మధ్యాహ్నం యానాం నుంచి తిరిగి వస్తూ తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక వద్ద గోదావరి పుష్కర రేవు వద్ద ఆగారు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగారు. కొద్దిసేపటి తర్వాత సాయిచంద్ర స్నేహితుల కళ్లెదుటే నీటిలో మునిగి గల్లంతయ్యాడు.

ఈత రాకుండానే దిగాడా..?

మిత్రుడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని మిగిలిన ఆరుగురు యువకులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆ విద్యార్థికి ఈత రాకపోవడంతో మునిగిపోయినట్లు భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటం, మేట వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గల్లంతైన విద్యార్థి కోసం జాలర్లు పడవలపై గాలించారు. అతడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. రాజమహేంద్రవరంలోని ఎ.వి.అప్పారావు రోడ్డు ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు.

ఏడాది కిందట ఏం జరిగిందంటే..

గత ఏడాది అక్టోబరు 21న ఇదే ప్రాంతంలో స్నానానికి దిగి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. ఒకరోజు తర్వాత వారి మృతదేహాలు లభించాయి. ఆ రోజు పశ్చిగోదావరి జిల్లా తణుకుకు చెందిన ఆరుగురు యువకులు యానాం విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తూ ఇక్కడ స్నానానికి దిగారు. ఒక యువకుడు మునిగిపోగా. రక్షించేందుకు వెళ్లిన ముగ్గురితో కలిసి నలుగురూ ప్రాణాలు కోల్పోయారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరప, న్యూస్‌టుడే: కరప మండలం కొంగోడులో మంగళవారం రాత్రి శుభకార్యక్రమానికి విద్యుత్తు దీపాలు బిగిస్తుండగా కె.గంగవరం మండలం వట్రపూడికి చెందిన శీలం ప్రవీణ్‌కుమార్ (17) విద్యుదాఘాతానికి గురై నిచ్చెన పైనుంచి కింద పడిపోయాడు. అపస్మారకస్థితికి చేరిన అతడిని స్థానికులు వెంటనే గొల్లపాలెం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లికి చెందిన శీలం నారాయణమూర్తి తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి వట్రపూడి గ్రామంలో నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు ప్రవీణ్ కుమార్ అద్దంపల్లికి చెందిన విద్యుత్తు పనుల కాంట్రాక్టర్ యనమదల గోవింద్‌తో కలిసి వివాహాది శుభకార్యక్రమాల్లో లైటింగ్ పనులు చేస్తుంటారు. తండ్రి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.సునీత తెలిపారు.

కుటుంబానికి న్యాయం చేయాలి

మసీదు సెంటర్ (కాకినాడ): విద్యుదాఘాతంతో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడ జీజీహెచ్ మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి బీఎస్పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు సుబ్బుబాయ్, తదితరులు ఆందోళన చేశారు. సంబంధిత గుత్తేదారుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఏలేటి శ్రీనుబాబు, మేగరాజు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలకు 17 నామపత్రాలు



నామపత్రాలు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి నందన

మసీదు సెంటర్(కాకినాడ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలకు సంబంధించి జీజీహెచ్‌లో మొత్తం 17 నామపత్రాలు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి టి.నందన బుధవారం తెలిపారు. జాబితాలో 243 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బుధవారం సాయంత్రం 4 వరకు నామపత్రాలు స్వీకరించామన్నారు. గురువారం పరిశీలిస్తామన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 18 వరకు గడువు ఉందన్నారు. 23న ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. అధ్యక్ష పదవికి 3, ఉపాధ్యక్ష పదవికి 2, కార్యదర్శికి 3, కోశాధికారికి 3 నామినేషన్లు, ఈసీ సభ్యుల స్థానాలకు 6 నామినేషన్లు వచ్చాయన్నారు. అధ్యక్ష పదవికి కాకినాడ జీజీహెచ్ హెడ్‌నర్సులు బూరిగ విజయలక్ష్మి, గోడి మేరి సుజాత, అయితాబత్తుల చిన ధనలక్ష్మి, ఉపాధ్యక్ష పదవికి జీజీహెచ్ నుంచి హెడ్‌నర్సు బొడ్డే రాణి, రాజమహేంద్రవరం జీజీహెచ్ నుంచి స్టాఫ్ నర్సు అంజలీశ్రీ నామినేషన్లు వేశారన్నారు. అధికారులు శివకామేశ్వరరావు, బి.గణేష్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ తరహాలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

మహాసేన రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న మహాసేన రాజేష్, నాయకులు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: పంజాబ్ తరహాలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని తెలుగు రాష్ట్రాల సీఎంలకు మహాసేన రాజేష్ సూచించారు. కాకినాడలో ఓ హోటల్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్‌లో 25 శాతం ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాజ్యాంగం ఎస్సీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తే పంజాబ్‌లో వారి వెనుకబాటుతనం గుర్తించి మరో 10 శాతం రిజర్వేషన్లు అదనంగా ఇస్తున్నారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇదే తరహాలో అమలు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చన్న తీర్పును ఆయన గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందుకు సుముఖంగా ఉన్నారన్నారు. తమిళనాడులో కూడా మాదిగలకు 3 శాతం అదనంగా రిజర్వేషన్లు కల్పించారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మాల, మాదిగలు, ఉప కులాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఎస్సీల్లో వెనుకబడిన వారి కోసం తాము ఈ ఉద్యమాలు చేస్తున్నామన్నారు. మాలల్లో 3 శాతం మందే ఉద్యోగులుగా ఉన్నారన్నారు. వర్గీకరణపై మంద కృష్ణ మాదిగ ఒత్తిడి చేయడం సరికాదన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)



గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా - 30,36, వంకాయలు - 40,54, బెండకాయలు - 18, పచ్చిమిర్చి - 40,58, కాకరకాయ - 26, బీర - 30,36, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 42, దొండకాయలు - 25, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 36, ఆనపకాయ - 32,40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 80, చేమదుంపలు - 30,40, మునగకాడలు - 8,10, బీట్‌రూట్ - 40, కీరదోస - 28, బీన్స్‌గింజలు - 130, అల్లం - 55, క్యాప్సికం - 96, బొబ్బర్లు - 46, చిలకడదుంపలు - 40, నిమ్మకాయలు(డజన్) - 24,54.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, జనక అయితేగనక, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, మానాన్న సూపర్‌హీరో, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- మానాన్న సూపర్‌హీరో, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సిఅండ్‌సీ 1- జనక అయితేగనక, సీఅండ్‌సీ 2- శ్యాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ - దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- జనక అయితేగనక(ఉ.సా) విశ్వం(మ.రా), శ్రీశ్రీనివాస(వేళంగి)- వెట్టయాన్ ది హంటర్(ఉ.సా) విశ్వం(మ.రా).

మేమున్నాం.. మీకు తోడుగా

కుక్కల బెడద..



సమస్య: సురేష్‌నగర్, శాస్త్రినగర్ ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి దాడి చేస్తున్నాయి. పిల్లలతో బయటకు రావాలంటే భయమేస్తోంది. - రాఘవ, స్థానికులు

సమాధానం: సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. -డా.పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, నగరపాలకసంస్థ

పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు



శాంతినగర్ ప్రధాన రహదారిలో భూగర్భ పారుదల ఎదురుగా గుంత కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. మూడు నెలల క్రితం ఆ ప్రాంతంలో గుంత తవ్వి పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో రాళ్లు పైకి లేచి రాకపోకల సమయంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం పాఠశాల విద్యార్థులు తిరిగే ఈ రహదారిలో ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 91548 46719

గత పాలనలో ఇష్టారీతిన ఖర్చు..

గత వైకాపా పాలనలో కాకినాడ నగరపాలక సంస్థ నిధులు దారి మళ్లించారు. వైకాపా అనుకూల వ్యక్తులకు అడ్డగోలుగా దోచిపెట్టారు. జగనన్న కాలనీ లేఅవుట్‌కు రూ.10కోట్లు, గ్రామ/వార్డు సచివాలయాల్లో ఫర్నిచర్‌కు రూ.20 కోట్లు ఇలా గత అయిదేళ్లలో రూ.కోట్ల నిధులను దుర్వినియోగం చేశారు. ఇప్పుడు వీటి లెక్కలు తేల్చేందుకు రాష్ట్ర అధికారుల బృందం తనిఖీ చేపడుతోంది.



కమిషనర్ భావనతో భేటీ అయిన ఆడిట్ బృందం

తేలనున్న అక్రమాల లెక్కలు

నగరపాలిక ఆదాయ, వ్యయాలపై ఆడిట్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో ఇక్కడి ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్మును ఇతర శాఖల్లో పనులకు ఖర్చు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంజినీరింగ్ విభాగంలో బిల్లుల చెల్లింపు, నిధులు మళ్లింపు చేశారు. అప్పుడున్న స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిడితో అధికారులు అడ్డగోలు పనులకు ఆమోదం తెలిపారు. సాధారణ నిధులు, కేంద్ర ప్రభుత్వ గ్రాంటులను నిర్దేశిత పనులకు కాకుండా ఇతర వాటికి వెచ్చించారు. ఎవరెన్ని తనిఖీలు చేస్తే మాకేంటి అనే రీతిలో అప్పట్లో నగరపాలిక అధికారులు దుబారా చేశారు. 2020-21 నుంచి 2024-25 (ఇప్పటి వరకు) కాకినాడ నగరపాలక సంస్థ ఆదాయ, వ్యయాలపై అకౌంటెంట్ జనరల్ ఆడిట్‌కు ఆదేశించింది. విజయవాడ నుంచి ముగ్గురు అధికారులతో కూడిన బృందం నగరపాలక సంస్థ రాబడి, ఖర్చులపై తనిఖీలు చేపట్టింది.

అధికారుల్లో వణుకు..

అకౌంటెంట్ జనరల్ ఆడిట్ బృందం ఆదాయ, వ్యయాలకు సంబంధించిన దస్త్రాల తనిఖీ మొదలు పెట్టడంతో కొందరి అధికారుల్లో వణుకు పుట్టుకుంది. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సాధారణ పరిపాలన శాఖల్లో మునుపెన్నడూ లేనంతగా వచ్చిన రాబడి, ఖర్చులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలిస్తున్నారు. 30 రోజుల పాటు తనిఖీ కొనసాగనుంది. ఇంజినీరింగ్ శాఖలో అసాధారణ రీతిలో మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. అప్పుడున్న వారు బదిలీపై వెళ్లారు. ఎవరు చేసిన తప్పులు వారికి వర్తించే విధంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. నగరపాలికలో కొందరు అధికారులు సొంత కారునే అద్దెకు పెట్టుకుని, కార్పొరేషన్ అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లను వీటికి వినియోగించారు. నగరపాలక సంస్థ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. అద్దెకారు డ్రైవర్‌కు ఇవ్వాల్సిన డబ్బులు అధికారులే నొక్కేస్తున్నారు. దీనిపై నిఘా పెట్టినట్లు సమాచారం. అన్ని విభాగాల్లోనూ అక్రమాల లెక్కలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నెలాఖరు వరకు సాగనున్న తనిఖీలు..

నగరపాలక సంస్థ కార్యాలయంలోని సాధారణ పరిపాలన విభాగంలో బుధవారం నుంచి ఆదాయ, వ్యయాలకు సంబంధించిన దస్త్రాల పరిశీలన మొదలుపెట్టారు. సాధారణ నిధుల వినియోగంతో పాటు, అమృత్-1, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, వివిధ గ్రాంటుల వినియోగానికి సంబంధించిన ప్రతీ దస్త్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అభ్యంతరాలను నమోదు చేయనున్నారు. లోపాలను అకౌంటెంట్ జనరల్‌కు నివేదిస్తారు. పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి అకౌంటెంట్ జనరల్ ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహిస్తోంది. తాజాగా గడిచిన మూడేళ్లకు సంబంధించిన రాబడి, ఖర్చులు, నిబంధనలు, ఉల్లంఘనలు గుర్తించనున్నారు. గత పాలనలో అధికారుల అక్రమాలు ఇప్పుడు వెలుగుచూసే అవకాశం ఉంది. ఆడిట్ పూర్తయిన తర్వాత అన్ని అంశాలను పరిశీలించాకే కేంద్ర ప్రభుత్వం గ్రాంటులు విడుదలయ్యే అవకాశం ఉంది.



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

గాంధీనగర్: ఇంజినీరింగ్ విద్యార్థికి శ్రీయువసేన సంఘం ల్యాప్‌టాప్ అందజేసింది. శ్రీయువసేన బ్లడ్‌బ్యాంకులో అధ్యక్షుడు బొల్లం సతీష్ బుధవారం దీన్ని అందజేశారు. ఆదిత్య సూరంపాలెం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్న పవన్ చదువు కోసం ల్యాప్‌టాప్ అవసరం కావడంతో సతీష్‌ను సంప్రదించారు. సతీష్ స్నేహితుడు మణికంఠ కుమార్తె జ్ఞానచంద్రిక రెండో పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. శ్రీయువసేన సహాయనిధి నుంచి మరో రూ.20 వేలు కలిపి ల్యాప్‌టాప్ కొని, ఇచ్చారు.

సీఎం సహాయ నిధికి విరాళం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: విజయవాడ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం కాకినాడ శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణ సేవా సమితి పాఠశాల ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1,11,000 విరాళం ఇచ్చింది. నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు బుధవారం చెక్కును అందజేశారు. సేవా సమితి అధ్యక్షులు వీఎల్ గాంధీ, కరస్పాండెంట్ కేఎస్ఎన్ శర్మ, కార్యదర్శి కె.సతీష్, పి.రంగనాథ్, కె.సుబ్రహ్మణ్యం, కర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల నిరసన

మసీదు సెంటర్: విధుల్లోకి తీసుకోవాలని నిరసన చేపట్టి 1,100 రోజులు అయ్యిందని, ఇప్పటికైనా తమను విధుల్లోకి తీసుకోవాలని కాకినాడ జీజీహెచ్ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పేర్కొన్నారు. జీజీహెచ్ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ జీజీహెచ్‌లో 2018లో డీఎంఈ ఆర్డర్ ద్వారా జీవో నం-151 ప్రకారం చేరామని, 2020లో ఆప్కాస్‌లో కలిపారన్నారు. 2021 సెప్టెంబరులో అక్రమంగా తమను విధుల నుంచి తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. 2018 నుంచి 2021 వరకు వివిధ జిల్లాల్లో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, టైలర్, ఎలక్ట్రీషియన్, లిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించామన్నారు. డీఎంఈ ఫోన్ ఆదేశాల మేరకు కక్షపూరితంగా తమను తొలగించారన్నారు. హైకోర్టును ఆశ్రయించగా, తొలగించకుండా స్టే ఆర్డరు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

కాకినాడ కలెక్టరేట్: అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో ఎస్.మల్లిబాబు హెచ్చరించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం(పీసీపీఎన్‌డీటీ)పై డివిజన్‌స్థాయి కమిటీ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఆడ శిశువుపై వివక్షతో జరిగే భ్రూణ హత్యలను నివారించడానికి డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. డెకాయ్ ఆపరేషన్స్ చేపట్టాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

లింగ వివక్షపై ఆయా శాఖలు సంయుక్తంగా అవగాహన కల్పించాలన్నారు. కొత్త స్కానింగ్ కేంద్రం ఏర్పాటు, రెన్యువల్, ఉద్యోగుల మార్పు, కొత్త యంత్రాల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను సమీక్షించారు. ఆమోదించి, జిల్లాస్థాయి కమిటీకి నివేదించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, వైద్యులు పి.సుజాత, జి.రాము, ఎం.కీర్తిప్రియా, ఐసీడీఎస్ సీడీపీవోలు కె.దుర్గాదేవి, వి.మాధవి, జి.ఉష, ఏ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తులు

సాంబమూర్తినగర్: కాకినాడ జగన్నాథపురంలోని సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ బాలికల ప్రాథమిక పాఠశాలలో 7 ఎస్జీటీ(క్రిస్టియన్ మైనార్టీ) ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవల్సిన వారు 24లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు



మణిమాలను సత్కరిస్తున్న బాలవేదిక కన్వీనర్ బలరామకృష్ణ

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉండాలని బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ పేర్కొన్నారు. బెంగళూరు వియిల్ ఫౌండేషన్ వారితో మహాత్మా గాంధీ దేశ్ సేవా పురస్కారం అందుకున్న కంపర వీణారావు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని అశ్వినీ మణిమాలను బుధవారం సత్కరించారు. ప్రముఖ కవి మాకినీడి సూర్యభాస్కర్ సౌజన్యంతో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచడంలో మణిమాల కృషి అభినందనీయమన్నారు. సీసీఆర్‌టీ జిల్లా రిసోర్స్ పర్సన్ కేవీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పీవీ సత్యనారాయణరాజు, ఎన్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఎం.కృష్ణమోహన్, రత్నశేఖర్, సాయిబాబా, వీఎస్‌వీ రమణమూర్తి, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20న సినీ సంగీత విభావరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: కోన విజయ భాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సినీ సంగీత విభావరి ఆహ్వాన పత్రికను సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ్ చౌదరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ది యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు బీఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం దంటు కళాక్షేత్రంలో 'ఏదో ఒకరాగం పిలిచిందీ వేళా' పేరుతో సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. సభ్యులు నాదెళ్ల ప్రభుదాసు, కట్టా కృష్ణారావు, రఘుబాబు, విజయ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపినవారికి జరిమానా

మసీదు సెంటర్ (కాకినాడ): మద్యం తాగి వాహనం నడిపిన 13 మందిపై కేసులు నమోదు చేశామని సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1,2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 13 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరుపర్చగా ఒకరికి మూడు రోజుల జైలు, ఆరుగురికి రెండు రోజుల జైలు, 6 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు బుధవారం తీర్పు చెప్పారన్నారు.

అందొచ్చిన కొడుకు.. అసువులు బాశాడు..

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ఆ ఇద్దరు అన్నాదమ్ములు.. అమ్మ కష్టాన్ని అర్థం చేసుకున్నారు. ఆమెకు అండగా నిలబడాలని అనుకున్నారు. అందులో ఒకరు విద్యుదాఘాతంతో చనిపోవడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. కాకినాడ రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని మహాలక్ష్మినగర్‌కు సంగాడి నూకరత్నంకు వెంకటేష్, హరీష్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. బిడ్డలే తన ప్రపంచంగా ఆమె జీవిస్తున్నారు. కొడుకులు ఇద్దరూ ఓ కార్పెంటర్ దగ్గర వడ్రంగి పనిచేస్తున్నారు. అందులో భాగంగా వెంకటేష్(24) స్థానిక అశోక్‌నగర్‌లోని ఓ మార్ట్ వెనుక వీధిలో నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనంలో వడ్రంగి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్న ప్రాంతంలో డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతణ్ని చికిత్సనిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకాపా ఆగడాలు సహించేది లేదు: ఎమ్మెల్యే

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనూ వైకాపా నాయకుల ఆగడాలు ఆగట్లేదని, ఇలాంటి వాటిని సహించమని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైకాపా నాయకుల దాడిలో గాయపడి, జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తెదేపా కార్యకర్తలు సీరం చిన్న, తాతారావులను బుధవారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీరం చిన్న తెదేపా సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటారన్నారు. అతనిపై వైకాపా ప్రభుత్వ హయాంలోనూ దాడి చేసి, కావాలనే స్టేషన్‌కు తీసుకువెళ్లి కేసు నమోదు చేశారన్నారు. తెల్లవారుజామున పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. తెదేపా తరపున పనిచేస్తున్నారనే కక్షతో వైకాపా నాయకులు పేర్ల దుర్గారావు, పేర్ల వెంకటేష్, దాసరి సతీష్, కనకరాజు, తదితరులు చిన్నాపై కక్ష పెంచుకున్నారన్నారు. అవకాశం కోసం చూసి, జాతర పేరుతో మారణాయుధాలతో దాడి చేశారన్నారు. వారిని చంపేయాలనే ఉద్దేశంతోనే విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారని, చుట్టుపక్కలవారు రావడంతో పారిపోయారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మూగు రాజు, చోడిపిల్లి ప్రేమానందం, ఎరిపిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వనమాడి, నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

మత్తు వైద్యంలో కొత్త విధానాలు తెలుసుకోవాలి

మసీదు సెంటర్: మత్తు విభాగంలో రోజురోజుకూ కొత్త పోకడలు వస్తున్నాయని, శస్త్రచికిత్స నొప్పి లేకుండా సులభంగా చేస్తున్నారని మత్తువిభాగ నిపుణులు డా.చక్రరావు పేర్కొన్నారు. కాకినాడ ఆర్ఎంసీ డిజిటల్ లైబ్రరీలో ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని జీజీహెచ్ అనస్తీషియా విభాగం, సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ కాకినాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డా.చక్రరావు, డా.కామేశ్వరరావుతో పాటు ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్, జీజీహెచ్ మత్తు విభాగాధిపతి డా.ఎ.విష్ణువర్ధన్, సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ కాకినాడ శాఖ అధ్యక్షకార్యదర్శులు డా.అనంతలక్ష్మి, డా.అనిల్‌కుమార్, ఏపీ స్టేట్ అనస్తీషియా ఉపాధ్యక్షుడు డా.అచ్యుతరామయ్య హాజరయ్యారు. వాకర్స్ క్లబ్‌లో అనస్తీషియా, సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్లు డా.జయధీర్, డా.ప్రసన్న, డా.వింధ్య, ఐఎంఏ కార్యదర్శి డా.చిట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెహర్‌నగర్ మొర వినేదెవరు..! దర్పణం

నగరంలోని 44వ డివిజన్ మెహర్‌నగర్‌లో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. ఈ డివిజన్‌లో సుమారు నాలుగు వేలకు పైగా జనాభా ఉంటోంది. ప్రధాన రహదారిపై ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి గుడి, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, నగరపాలకసంస్థ కమిషనర్ కార్యాలయం వంటివి ఇక్కడే ఉన్నాయి. అలాంటి ప్రాంతంలో అనేక ఇబ్బందులు నెలకొనడం గమనార్హం. జీపీటీ కళాశాల ప్రహరీకి చేర్చి ఉన్న కాలువపై పలు దుకాణాలు అక్రమంగా వెలిశాయి. రహదారుల పక్కన ఎండిన చెట్టు కొమ్మలు ఉండటం, కాలువల్లో పూడిక తీయపోవడం, కాలువ గట్లు పగిలిపోవడం తదితర ఇబ్బందులు నెలకొన్నాయి. విద్యుత్తు స్తంభాలకు తీగలు అల్లుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొన్నిచోట్ల దీపాలు వెలగట్లేదు. కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయని, పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆ ప్రాంతంలో వేంకటేశ్వస్వామి గుడి వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మలుపు ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదు సెంటర్



విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పచ్చని తీగలు



కాలువపై అక్రమంగా దుకాణాలు



రహదారి పక్కన ఎండిన చెట్టుకొమ్మలు

తడిచెత్తతో త్వరలో గ్యాస్ ఉత్పత్తి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో రోజూ సేకరిస్తున్న తడిచెత్తతో త్వరలో సీఎన్‌జీ గ్యాస్ ఉత్పత్తికి బయో మెథనేషన్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ భావన తెలిపారు. బుధవారం ఆమె అధికారులతో కలిసి స్థానిక రెవెన్యూ కాలనీలోని ఆర్గానిక్ కంపోస్టు ప్లాంటు, సంజయ్‌నగర్‌లోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. తడి చెత్త నుంచి తయారవుతున్న కంపోస్టు ఎరువును పరిశీలించారు. దీన్ని మొక్కలకు వినియోగిస్తున్నట్లు సిబ్బంది ఆమెకు వివరించారు. కంపోస్టు ఎరువు తయారీని పెంచాలని కమిషనర్ ఆదేశించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యనిర్వాహక ఇంజినీరు కామేశ్వరరావు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీరు నాగేశ్వరరావు, ఎంహెచ్‌వో డి.పృథ్వీచరణ్ పాల్గొన్నారు.



కంపోస్టు తయారీ పరిశీలిస్తున్న కమిషనర్

ధాన్యం రవాణా ఏజెన్సీలపై నేడు సమావేశం

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా కల్లాల నుంచి ధాన్యాన్ని సీఎంఆర్ రైస్‌మిల్లులకు రవాణా చేసేందుకు ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు నిర్ధారణకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు జేసీ రాహుల్‌మీనా తెలిపారు. ఆసక్తి ఉన్న ఏజెన్సీల ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రమాదానికి మెట్లు



ర.భ.శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. గత వైకాపా పాలనలో నిర్వహణ లేక మరమ్మతులు చేసేందుకు సొమ్ములేక వెలవెలబోతోంది. ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలోని పైఅంతస్తులో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీరు ఛాంబరు ఉంది. పైకి వెళ్లే మెట్ల కింద భాగం పూర్తిగా ధ్వంసమైంది. భారీ వర్షాల నేపథ్యంలో కూలిపోయే అవకాశం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేయాలని ఆవేదన చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

మందుబాబులకు అడ్డా..



కాకినాడలో ఆర్అండ్‌బీ అతిథి గృహానికి నిత్యం ఎంతోమంది వస్తుంటారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మందు బాబులకు అడ్డాగా ఈ ప్రదేశం మారింది. సమీపంలో మద్యం దుకాణాలు లేకపోయినా ఎక్కడో కొనుక్కుని ఇక్కడకు తెచ్చుకుని తాగుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి నెలకొందని, అతిథి గృహం గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

– ఈనాడు, కాకినాడ

ఆటలకు ఆత్మబంధువు



డీఎస్ఏలో హరీష్ ట్రస్ట్ నిర్మించిన క్రికెట్ నెట్స్

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ఆయనో క్రీడాకారుడు. ఆటల విలువ తెలుసు. ఆహ్లాదం.. ఆరోగ్యానికే కాదు.. జీవితాలు చక్కదిద్దు కోడానికి క్రీడలు ఉపకరిస్తాయని నమ్మారు. దాన్ని ఆచరణలో పెట్టారు. ఆయనే కాకినాడకు చెందిన తలాటం హరీష్. హరీష్ ఛారిటబుల్ ఆర్గనైజేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసి క్రీడారంగానికి తనవంతు సాయం అందిస్తున్నారు. గతేడాది కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో క్రికెట్ డే అండ్ నైట్ నెట్స్‌ను సుమారు రూ.20లక్షలతో పూర్తి హంగులతో ఏర్పాటు చేశారు. గతేడాది భూపతిపాలెంలో బాస్కెట్ బాల్ కోర్టు ఆధునికీకరణ చేయించారు. ఈ ఏడాది జనవరిలో పిఠాపురం మండలం రాపర్తిలోని ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ కోర్టుల ఆధునికీకరణ, కత్తిపూడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్ టర్ఫ్ నెట్లను రూ.నాలుగు లక్షలతో వేయించారు. గత అక్టోబరులో క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో అధ్వానంగా ఉండే మరుగుదొడ్లను రూ.మూడు లక్షలతో బాగు చేయించారు. కాకినాడ, ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో రూ.2.25 లక్షలతో ఫ్లడ్‌లైట్లు పెట్టించారు. రంగరాయ వైద్య కళాశాల క్రీడామైదానంలో రూ.2.50 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కబడ్డీ, షటిల్ ఇండోర్ ఆడిటోరియంలో రూ.2.75లక్షలతో దీపాలు ఏర్పాటు చేయించారు. పీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో కళాశాల, విద్యార్థులకు ఉపయోగపడేలా రూ.1.80లక్షలతో నిర్మాణాలు చేపట్టారు.

నావంతు బాధ్యతగా..



క్రీడలపై ఆసక్తితో డీఎస్ఏతో పాటు ఇతర చోట్ల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా. గత ప్రభుత్వంలో క్రీడలకు ఎటువంటి నిధులు కేటాయించలేదు. దాంతో క్రీడాకారులు వెనుకపడ్డారు. పలు మైదానాలు, విద్యా ప్రాంగణాల్లో క్రీడారంగానికి చెందిన పలువురు సమస్యలు నా దృష్టికి తీసుకొస్తున్నారు. వసతులు కల్పించడం, పరికరాలు సమకూర్చడం ఆనందంగా ఉంది.

– తలాటం హరీష్, హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్

అవీ ఇవీ అన్నీ

ఎస్‌పీసీఏపై కమిషనర్ సమావేశం: నగరంలోని జంతు సంరక్షణ కేంద్రం(ఎస్‌పీసీఏ)లో సదుపాయాలపై బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భావన సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో పరిస్థితులపై చర్చించారు. వీటిని కలెక్టర్‌కు నివేదించాలని నిర్ణయించారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ మనోహర్, తహసీల్దారు జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విభాగాధిపతులతో సమీక్ష: నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కమిషనర్ భావన వివిధ విభాగాధిపతులతో సమీక్షించారు. పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్‌లు, బిల్డింగ్ ఫీజులు, ప్లాన్ల జారీ, తదితర అంశాలపై చర్చించారు. 19న పురపాలక కమిషనర్ ఆధ్వర్యంలో జరిగే సమీక్షకు నివేదిక సిద్ధం చేశారు.

ఆస్తిపన్ను సవరణ చట్టం రద్దు చేయాలి: ఆస్తిపన్ను సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కాకినాడ పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఏటా 15 శాతం ఆస్తి పన్ను పెంచి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. ఇప్పటికే ఆస్తి పన్ను 75 శాతం పెరిగిందని, ఈ చట్టాన్ని రద్దు చేసి, అద్దె ఆధారిత ఆస్తి పన్ను విధానం అమలు చేయాలన్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి విశ్వకర్మ యువజన కార్యక్రమంలో భాగంగా చేతివృత్తి పనివార్లకు ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం నియోజకవర్గ భాజపా సమన్వయకర్త దూడల శంకరనారాయణ కోరారు. బుధవారం గొల్లపాలెంలో దోబి పనివారికి ఇస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.15 వేల విలువైన ఆధునాతన పరికరాలు అందజేస్తారన్నారు. రూ.3 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. శిక్షణ తరగతుల జిల్లా కోఆర్డినేటర్ శ్రీనుబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇష్టమైన మిల్లుకు ధాన్యం విక్రయించొచ్చు

పెదపూడి, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యాన్ని తమకు ఇష్టమైన రైసుమిల్లులకు విక్రయించుకోవచ్చని వ్యవసాయాధికారి టి.వి.ఆర్.మణిదీప్ అన్నారు. బుధవారం పెదపూడి ఎంపీడీవో కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో మొత్తం 49వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటకు మద్దతు ధర వచ్చేందుకు కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. సిబ్బంది తేమ శాతం, ప్రభుత్వ ప్రమాణాలను ఏవిధంగా పాటించాలో శిక్షణ ఇచ్చామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: పెద్దాపురం పట్టణం రామారావుపేట ప్రధాన రహదారి వెంట పిచ్చి మొక్కలు విస్తరించాయి. రాత్రులు విషసర్పాలు ఇందులో నుంచి వస్తున్నాయి. వీటిని తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
- సత్యవతి, పెద్దాపురం

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి పిచ్చి మొక్కలు తొలగింపుకై చర్యలు తీసుకుంటాను.
- కేవీ.పద్మావతి, కమిషనర్, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

– న్యూస్‌టుడే, పెద్దాపురం

ఘనంగా గౌరీదేవి ప్రతిష్ఠ


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కొత్తపల్లి పంచాయతీ గాదులదొడ్డిలో గౌరీదేవి ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. బుధవారం భక్తులు సమీపంలోని పొలాల నుంచి వరిదుబ్బును తీసుకొచ్చి గ్రామోత్సవం అనంతరం ఆలయంలో గౌరీదేవిగా ప్రతిష్ఠించారు. కార్తీకమాసం ముగిసే వరకు నెలరోజుల పాటు గౌరీదేవిగా కొలిచే వరిదుబ్బుకు బాలికతో రోజూ పూజలు జరిపిస్తారు. పాడిపంటలు బాగుండాలని, గ్రామం సస్యశ్యామలంగా ఉండాలంటూ ఏటా గౌరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఆదర్శం దిశగా అడుగులు.. అభివృద్ధికి ప్రణాళికలు

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రామాలు, పట్టణాల్లో సమస్యలను గుర్తించారు. పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులను గుర్తించి నివేదిక తయారు చేశారు. అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక నివేదికను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉప ముఖ్యమంత్రికి పంపించారు. త్వరలో నిధులు వెచ్చించి పనులు చేపట్టనున్నారు. –న్యూస్‌టుడే, పిఠాపురం

38 సమస్యల గుర్తింపు..

పిఠాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే కలెక్టర్ షాన్‌మోహన్ పర్యవేక్షణలో రెండు వారాలకోసారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలతోపాటు, నగర పంచాయతీ, పురపాలక సంఘంలో సమస్యలు గుర్తించేందుకు 21 మంది నోడల్ అధికారులను నియమించారు. ఈ నెల 10న ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక్కొక్కరు రెండు, మూడు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని, ప్రత్యేక నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేశారు. ఆ రోజున నియోజకవర్గంలోని పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలు, గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో 38 సమస్యలను గుర్తించారు. ప్రధానంగా తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య ఇబ్బందులు, పాఠశాలల్లో వసతుల కొరత, రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోవడం, రహదారులు, మురుగు కాలువలు లేకపోవడం, అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండడం, విద్యార్థులకు క్రీడా సామగ్రి ఇవ్వాలని, కార్మికులకు ఉపాధి పని దినాలు పెంచాలని తదితర అంశాలను గుర్తించారు. ప్రత్యేక నిధులు కేటాయించి ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా కలెక్టర్ సిద్ధమవుతున్నారు.

సిద్ధమైన యంత్రాంగం

నిలిచిపోయిన నిర్మాణాలపైనా దృష్టి సారించాలి..

అధికారులు గుర్తించినవే కాకుండా నియోజకవర్గంలో ఇంకా సమస్యలున్నాయని ప్రజలు ప్రస్తావిస్తున్నారు. పలు గ్రామాల్లో శ్మశానవాటికలు లేవు. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి ఇబ్బందులున్నాయి. చాలా కాలనీల్లో మురుగు నీరు పోయే వ్యవస్థ సక్రమంగా లేదు. పాఠశాలల్లో క్రీడా మైదానాల కొరత ఉంది. నాడు-నేడు పనులు, సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలు నిలిచిపోయాయి. పంచాయతీరాజ్, ర.భ రహదారులు అయిదేళ్లగా అభివృద్ధి లేక దుస్థితికి చేరాయి. ఇంటింటా చెత్త సేకరణ జరగడం లేదు. సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. చాలా గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శిథిలమయ్యాయి. జల్‌జీవన్ మిషన్ పనులు నిలిచిపోయాయి.


పారిశుద్ధ్య సమస్యను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పరిష్కారానికి చర్యలు చేపట్టాం..

గ్రామాలు, పట్టణాల్లో సమస్యలు గుర్తించేందుకు 21 మంది నోడల్ అధికారులను నియమించాం. వారు గుర్తించిన 38 అంశాలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాం. ఇందులో ఇప్పటికే 5 సమస్యలను పరిష్కరించాం. అవసరమైన నిధులు సమకూర్చి మిగిలిన వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు చేపడుతున్నాం.
– షాన్ మోహన్, కలెక్టర్, కాకినాడ జిల్లా

పంచాయతీకి సహకరించకపోతే పనులు జరగనివ్వం

పీఐఎల్ సంస్థ ప్రతినిధులతో పోలేకుర్రు గ్రామస్థులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: గాడిమొగ, పి.మల్లవరంలోని చమురు సంస్థలకు పోలేకుర్రు నుంచే తాగునీరు, సుంకటరేవు నుంచి యానాంకు గ్యాస్ పైపులైను వెళ్తుందని.. అక్కడి ప్రజలకు ప్రాణహాని జరిగితే బాధ్యులు ఎవరని పోలేకుర్రు గ్రామస్థులు ప్రశ్నించారు. తమ పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తే సుంకటరేవులో పనులు జరగనిస్తామని వారు తెల్చిచెప్పారు. తాళ్లరేవు రెవెన్యూ కార్యాలయంలో పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు, పోలేకుర్రు, తోటపేట, జైభీమ్‌పేట, తూర్పుపేట, చినబాపనపల్లి, సత్యనారాయణపురం గ్రామస్థులు, పీఐఎల్ కంపెనీ ప్రతినిధులతో తహసీల్దారు పితాని త్రినాద్, ఉపతహసీల్దారు సూరిబాబు, ఆర్.ఐ.రామకృష్ణ, ఎస్‌వో రమణకుమార్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పోలేకుర్రు పంచాయతీని దత్తత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను వారికి తెలిపారు. దీనిపై పీఐఎల్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధులు కేటాయించేలా సంస్థ నిర్వాహకులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. ఆ నిధులు ఎంత అనేది స్పష్టం చేయకపోగా చర్చలను వాయిదా వేశారు. సర్పంచి వెంటపల్లి నూకరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధ, వీఆర్వో ప్రభుదాసు, మాజీ సర్పంచి దడాల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య ఎస్‌టీపీ ప్లాంటు నిర్మించొద్దు


కమిషనర్ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేస్తున్న మానవహక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, నాయకులు, స్థానికులు

సామర్లకోట, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య సెప్టిట్యాంక్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మించవద్దని పురపాలక సంఘ కమిషనర్ శ్రీవిద్యకు వినతి పత్రం అందించారు. స్థానిక గణేష్ కాలనీ వద్ద ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు ఆపాలని స్థానికులు బుధవారం డిమాండ్ చేశారు. మానవహక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, పురపాలక సంఘ కౌన్సిలర్ మర్రి శేషారావు, స్థానిక నాయకులు పోలిమాటి ప్రసాద్, నూతలపాటి అప్పారావు, కచ్చా రాజు తదితరులు పురపాలక సంఘ కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ శ్రీవిద్యను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ కాలనీలో ఒక పక్క కబేళా దుర్వాసనతో, మరో పక్క పట్టణంలో వెలువడిన చెత్తను ఇక్కడ వేసి డంపింగ్ యార్డుగా మార్చడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పుడు పట్టణంలో మురుగుదొడ్లలో వ్యర్థ జలాలను తీసుకొచ్చి ఇక్కడ శుద్ధి చేసేందుకు ప్లాంటు నిర్మించడం సరికాదని, జనావాసాల వద్ద ఇటువంటి ప్లాంటు నిర్మించవద్దన్నారు. కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం అయ్యిందని ఈ ప్లాంటు వల్ల ప్రజలకు ఎటువంటి వాసన ఉండదని, వ్యర్థ జలాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ట్యాంకుల్లో నింపి ట్రీట్ మెంటు చేసిన తర్వాత జలాలను ఎరువుగా ఉపయోగించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ డీ4 సెక్షన్ కాకినాడ అర్బన్ శశికాంత్‌నగర్, ఆర్‌టీవో కార్యాలయం, రమణయ్యపేట ఫీడర్ల పరిధిలో విద్యుత్తు లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తాని ఏఈ గౌతు రాజు తెలిపారు. వీటిలో లక్ష్మీగణపతి, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ గోదాము, స్టేడియం వెనుక, తోట సుబ్బారావునగర్ 1, 2 రోడ్లు, బోట్ క్లబ్, విద్యానగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుదన్నారు.

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగి సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్తు లైను మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు ఉండదని ఏఈ ఎన్.ఉదయభాస్కర్ బుధవారం తెలిపారు. సీతారామపురం, కోరంగి, పెద, చిన బొడ్డువెంకటాయపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల గ్రామాల్లో సరఫరా నిలుపుదలకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన


చేబ్రోలు శివారు ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాల మధ్య ఉన్న డంపింగ్‌యార్డ్‌ను తొలగించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు కాకినాడ ఆర్డీవో మల్లిబాబు వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం గొల్లప్రోలు శివారులో రైతులకు చెందిన భూములను పరిశీలించారు. చేబ్రోలు శివారు కంకరగని ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కూడా చూశారు. జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న పాకలను తక్షణం తొలగించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. అనంతరం వన్నెపూడిలో పర్యటించారు. తహసీల్దారు కేవీవీ సత్యనారాయణ, నగర పంచాయతీ కమిషనర్ రవికుమార్, మండల సర్వేయరు కేదారేశ్వరరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం

కరప, న్యూస్‌టుడే: ప్రజలకు ఉపయోగపడే పనులను గ్రామ సభల్లో గుర్తించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చేపట్టేందుకు కృషి చేస్తామని ఏపీవో వెంకటరమణకుమార్ అన్నారు. కరపలో బుధవారం ఆయన సర్పంచి ఎస్.ఆశాజ్యోతి అధ్యక్షతన ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు ప్రణాళిక రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. భోగిరెడ్డి సూర్యనారాయణ, దేవు వెంకటేశ్వరరావు, బి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జనవరికి పల్లెల్లో నిర్మాణాలు పూర్తి

రమణయ్యపేట (సర్పవరం జంక్షన్): గ్రామీణ రహదారుల నిర్మాణాలను జనవరి నాటికి పూర్తి చేస్తామని కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. బుధవారం పెనుమర్తి, పండూరు, పి.వెంకటాపురం, సూర్యారావుపేటలో రహదారుల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: జి.మామిడాడ, గండ్రేడు, అచ్యుతాపురత్రయం, రామేశ్వరంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమి పూజలు చేశారు.

కాజులూరు: శలపాక, తణుకువాడ, గొల్లపాలెం, బందనపూడి, ఆర్యవటం, మతుకుమిల్లి, తర్లంపూడి, టి.మామిడాడ, తనుమళ్ల, పెనుమళ్ల, అండ్రంగి, తిప్పరాజుపాలెం, ఉలంపర్రులలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు తదితర అభివృద్ధి పనులకు తెదేపా నాయకులు శంకుస్థాపనలు చేశారు.

గొల్లప్రోలు: ఏ.పి.మల్లవరం, ఏ.కె.మల్లవరం, తాటిపర్తి, చెందుర్తి, వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపనలు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల లోవరాజు, జనసేన ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ చల్లా లక్ష్మి, పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సూరిశెట్టి జయలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.


పండూరు ఎస్సీ కాలనీలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ


కొడవలిలో జనసేన నాయకులు, జనసైనికుల వాగ్వాదం

చెందుర్తి, కొడవలిలో వాగ్వాదాలు

చెందుర్తి, కొడవలి గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సిమెంటు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహిస్తున్న సమయంలో కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చెందుర్తిలో పల్లె పండుగ కార్యక్రమానికి తమను ఆహ్వానించలేదంటూ తెదేపా నాయకులు, కార్యకర్తలు జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు చెబుతుండగా జనసేన నాయకులు వాగ్వాదానికి దిగారు. రెండు పార్టీల నాయకులు సర్దుబాటు చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. కొడవలిలో తాము సచివాలయం దగ్గర నిరీక్షిస్తుంటే శంకుస్థాపనలు చేయడం ఏంటని కొందరు జనసేన నాయకులు ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో స్థానికులు, ఎస్సై రామకృష్ణ వారిని వారించారు. అనంతరం ప్రశాంతంగా శంకుస్థాపనలు జరిగాయి.

120 దుకాణాలకు మద్యం

సామర్లకోట: జిల్లాలో సామర్లకోట ఐఎంఎల్ డిపో పరిధిలోని ఏడు సర్కిల్స్‌లోని 120 దుకాణాలకు మద్యం సరఫరా చేసినట్లు ఇన్‌ఛార్జి మేనేజర్ సీహెచ్ రమణబాబు తెలిపారు. డిపో పరిధిలో కాకినాడ నార్త్, కాకినాడ సౌత్, పిఠాపురం, ప్రత్తిపాడు, పెద్దాపురం, తాళ్లరేవు, తుని పరిధిలో 155 దుకాణాలు ఉండగా వాటిలో 120 దుకాణాలకు 150 కేసులు చొప్పున మద్యం సరఫరా చేశామన్నారు. బుధవారం మద్యం దుకాణదారులు కేసులు తరలించేందుకు భారీ ఎత్తున డిపోనకు చేరుకున్నారు.

సర్పవరం (సర్పవరం జంక్షన్): నూతన మద్యం పాలసీలో భాగంగా బుధవారం కాకినాడ గ్రామీణ మండలంలోని పలు గ్రామాల్లో కొత్త మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. గ్రామీణంలో 12 దుకాణాలకుగాను 8 మాత్రమే ప్రారంభించారు. సర్పవరం గ్రామంలో రాజకీయ విభేదాల కారణంగా ప్రధాన రహదారిపై పక్కపక్కనే రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. సర్పవరం, వలసపాకల తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్వహించిన దుకాణాలను కొత్తవారు అద్దెకు తీసుకున్నారు. ఆయా దుకాణాల్లో మద్యం నిల్వలను ఎక్సైజ్ అధికారులు తరలించకపోవడంతో కొందరు వ్యాపారులు ఆరుబయటే మద్యం అమ్మకాలు సాగించారు.


సామర్లకోట ఐఎంఎల్ డిపో వద్ద దుకాణదారులు

పాత నిల్వలు స్వాధీనం

పిఠాపురం: నియోజకవర్గంలోని 17 ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ శివరామరాజు బుధవారం పరిశీలించి, నిల్వలను స్వాధీనం చేసుకుని ప్రత్యేక లారీలో సామర్లకోట డిపోనకు పంపించారు. లాటరీ ద్వారా పిఠాపురంలో 19 కొత్త దుకాణాలు దక్కించుకున్న వారు అమ్మకాలు ప్రారంభించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలులో రెండు, చేబ్రోలు, దుర్గాడ, వన్నెపూడిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిన నిల్వలను ఎక్సైజ్ పోలీసు సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు.

పెద్దాపురం: ప్రభుత్వ లైసెన్సులు పొందిన ప్రైవేటు దుకాణదారులే మద్యం అమ్మకాలు సాగించాలని, బెల్ట్ షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దాపురం ఎక్సైజ్ సీఐ అర్జున్ తెలిపారు. పట్టణంలో 6, రూరల్‌లో 5, జగ్గంపేటలో 5, గండేపల్లిలో 3 దుకాణాలకు అనుమతులు ఇచ్చామన్నారు.


సర్పవరం గ్రామంలో పక్కపక్కనే దుకాణాలు

దుకాణం పెట్టొద్దని..

సామర్లకోట: సామర్లకోట బళ్లమార్కెట్ సెంటర్‌లో మద్యం దుకాణం పెడితే సహించేది లేదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. బుధవారం మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా ఏఐఎండీఎస్ ఆధ్వర్యంలో మద్యం దుకాణం ఏర్పాటు చెయ్యవద్దని గోడపత్రాన్ని అతికించారు. బళ్ల మార్కెట్ వద్ద పురపాలక సంఘం, ప్రభుత్వ కార్యాలయాలు, పురపాలక సంఘ పాఠశాలలు, దేవాలయాలు ఉన్నాయన్నారు.

హ్యాకథాన్‌తో నూతన ఆవిష్కరణలకు అవకాశం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ, అనుబాబు తదితరులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: విద్యార్థులు కోడింగ్ సామర్థ్యం పెంపొందించుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేసేందుకు హ్యాకథాన్ కార్యక్రమం దోహదపడుతుందని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. బుధవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజినీరింగ్ కళాశాలలో సాధన 2కే24 పోస్టర్ ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ, కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ అఖిలేష్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీఎన్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పిఠాపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో డీఎస్సీకి సిద్ధమయ్యే వారికి ఉచితంగా శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ తెలిపారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన వారు 89788 69999 ఫోన్ నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం తెరిచి కానుకలు లెక్కించినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. 210 రోజులకుగాను రూ.46,28,750 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. లెకింపులో ఆలయ సిబ్బంది, చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే : ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 24 సంవత్సరాలుగా కొనసాగుతున్న అధ్యాపకులను రెగ్యులర్ చేసే విధంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని కోరుతూ జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ జేఏసీ తరపున వినతిపత్రం అందజేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒప్పంద అధ్యాపకులు సిఎం గౌస్, మూర్తి, కె.శోభన్‌బాబు, జి.లక్ష్మణరావు, కె.చిన్నబ్బాయి. ఎం.మాధురి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సత్కారం

గొల్లప్రోలు: గొల్లప్రోలు స్టేషన్‌లో దీర్ఘకాలంగా పనిచేసి బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ జాన్, కానిస్టేబుళ్లు గంగరాజు, సంతోష్, రాజాబాబు, రవి, సూరిబాబు, బాలాజీ, పద్మశ్రీలకు శాలువాలు కప్పి ఎస్సై రామకృష్ణ బుధవారం సన్మానించారు. తొమ్మిది మంది సిబ్బందిని గొల్లప్రోలు స్టేషన్‌కు బదిలీచేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారని, వారు గురువారం విధుల్లో చేరతారన్నారు.

నిధుల విడుదలకు వినతి

రమణయ్యపేట (సర్పవరం జంక్షన్): గ్రామాల్లో రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ కార్యాలయంలో బుధవారం రమణయ్యపేట మాజీ సర్పంచి రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ విడుదల చేయించాలని వినతి పత్రం అందజేశారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

మసీదుసెంటర్(కాకినాడ): సామర్లకోటకు చెందిన ఆర్.శ్రీనివాస్(45) జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందారు. వ్యక్తిగత కారణాలతో గడ్డిమందు తాగారు. తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఈనెల 13న జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ద్విచక్ర వాహనంతో ఢీ


గాయపడిన కమలరత్నం

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట సెంటర్‌లో మద్యం మత్తులో యువకులు మోటారు సైకిల్‌తో వృద్ధురాలిని ఢీ కొట్టారు. ఈ ఘటనలో వృద్ధురాలితోపాటు యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం స్థానిక బ్రౌన్‌పేటకు చెందిన కమలరత్నం(65) నడిచి వెళుతుండగా ముగ్గురు యువకుల మోటారు సైకిల్‌పై వచ్చి బలంగా ఢీ కొట్టారు. దాంతో వృద్ధురాలికి, ద్విచక్రవాహనపై ఉన్న యువకుడికి బలమైన గాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరి యువకులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వారికి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంతలో పడి మహిళకు గాయాలు

సామర్లకోట గ్రామీణం: సామర్లకోట- కాకినాడ రోడ్డులో గుంతల కారణంగా రోజూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మార్గం పొడవునా ఉన్న గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారినపడుతూనే ఉన్నారు. బుధవారం ఉదయం వి.కె.రాయపురం సమీపంలో కాకినాడ వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న వాహనం గుంతల్లో పడి కింద పడటంతో అది నడుపుతున్న మహిళ తలకు తీవ్ర గాయమైంది. తోటి వాహనదారులు ఆమెను వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. నిత్యం ఈ రోడ్డులో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా, తలలు, చేతులు, కాళ్లు విరిగిపోతున్నా అధికారులు మాత్రం కనీసం గుంతలు పూడ్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

ఉప్పాడ పట్టు చీరల స్టాల్‌ను సందర్శించిన కుష్బూ


స్టాల్ వద్ద సినీ నటి కుష్బూ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: దిల్లీలో ఈ నెల 7 నుంచి జరుగుతున్న చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఉప్పాడ పట్టుచీరల స్టాల్‌ను సినీ నటి కుష్బూ బుధవారం సందర్శించి పట్టు చీరలు కొనుగోలు చేశారు. ఉప్పాడకు చెందిన నేత కార్మికుడు కాకి గంగాధర్ పట్టు చీరల తయారీ, విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ నేత వస్త్రాలను ధరించి చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని కుష్బూ కోరారు.

నలుగురు ఉపాధ్యాయులకు నోటీసులు

పిఠాపురం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో తగిన విద్యా సామర్థ్యాలు లేకపోవడంపై డీఈవో రమేష్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మండలం చిత్రాడలో మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. తరగతుల వారీగా ఆయా పాఠ్యాంశాల్లో ప్రశ్నలు అడిగితే విద్యార్థులు ఎవరూ చెప్పలేకపోయారు. పాఠశాల నిర్వహణ, రికార్డులు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈవో చెప్పారు.

భావనారాయణస్వామి ఆలయ ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

రమణయ్యపేట (సర్పవరం జంక్షన్), న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ నియోజకవర్గం సర్పవరం గ్రామంలో సుమారు 5 వేల సంవత్సరాల చరిత్రగల ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంభూ రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయం ఆన్‌లైన్ సేవల వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం కాకినాడ కార్యాలయంలో ప్రారంభించారు. దాతల విరాళాలతో ఆలయం మరింత అభివృద్ధి చెందడానికి, దూర ప్రాంతాల భక్తులకు అవసరమైన సేవలు అందించడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

విద్య, పరిశోధన అంశాల్లో ఎంవోయూ


ఒప్పంద పత్రాలు చూపుతున్న ఉభయ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ సౌత్‌కరోలినా అప్ స్టేట్‌తో ఒప్పందం విద్య, పరిశోధనలపై ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రొ-ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, ద్వంద్వ డిగ్రీ సమర్పణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిత్య ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, యూనివర్సిటీ సౌత్ కరోలినా అప్ స్టేట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల అవగాహనా కార్యక్రమాలు

కిర్లంపూడి: బూరుగుపూడి గ్రామంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు రైతు అవగాహనా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. గ్రామంలో ఆరు నెలలు పాటు మకాం ఉండి గ్రామంలోని పంటలు, రైతుల చేపడుతున్న సాగు విధానంలో మెలకువలు నేర్పించడం, రైతుల నుంచి అనుభవ పాఠాలు నేర్చుకుంటామని విద్యార్థులు తెలిపారు.


బూరుగుపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు సందనం

మురుగు కాలువ శుభ్రం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : సిరిపురం ఎస్సీ, బీసీ కాలనీ వద్ద కాలువ పూడిక, చెత్తతో నిండిపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడంలేదని ఆ ప్రాంత వాసులు వాపోయారు. విషయాన్ని సర్పంచి పీతల నూకరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించి కాలువలో వ్యర్థాలను, పూడికను తొలగించేందుకు అవసరమైన పనులు చేయించారు.


సిరిపురంలో పూడిక తీస్తున్న సిబ్బంది

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

అడ్డంగా వాహనాలు.. గాల్లో ప్రాణాలు

న్యూస్‌టుడే - తుని, తుని పట్టణం

తుని నుంచి జగ్గంపేట వరకు 60 కి.మీ. జాతీయ రహదారిపై రోజూ ప్రమాదాలు జరుగుతున్నా భారీ వాహనాలు నడిపే చోదకుల్లో మార్పు రావట్లేదు. దాబాలు, హోటళ్లు, మద్యం దుకాణాలున్న చోట ఇష్టారీతిన ఆపేస్తున్నారు. వేగంగా వస్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారిపై అడ్డంగా ఆపిన భారీ వాహనాలను ఢీకొంటున్నాయి. పదుల సంఖ్యలో క్షతగాత్రులు అవుతున్నా, ప్రాణాలు పోతున్నా అధికారుల నియంత్రణ చర్యలు ఉండట్లేదు.


తుని శ్రీనివాసా థియేటర్ వద్ద ఎన్‌హెచ్‌పై వాహనాలు

ప్రమాదకరంగా కూడళ్లు..

తుని పట్టణం కొట్టాం సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గం, డీ మార్ట్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జగన్నాథగిరి, వి.కొత్తూరు, చేపూరు, ఎర్రకోనేరు, తేటగుంట, బెండపూడి జంక్షన్ల వద్ద ఇదే పరిస్థితి. ప్రస్తుతం దసరా సెలవులు పూర్తవ్వడంతో ఆయా ఊర్లకు తిరుగుప్రయాణం అవ్వడంతో వాహనాల రద్దీ మరింత పెరిగింది. గతంలో బ్లాక్ స్పాట్లను గుర్తించి పోలీసులు, హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో సూచీ బోర్డులు, ఇసుక నింపిన డ్రమ్ములు, బారికేడ్లు పెడుతున్నా వాహనాల తాకిడికి దెబ్బతిన్నాయి.

అధ్వానంగా రహదారి నిర్వహణ..

ఎన్‌హెచ్‌పై అనేకచోట్ల పాదచారుల మార్గం దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. తుప్పలు పెరిగిపోయాయి. వాహనాలు ఢీకొని ఇనుప గ్రిల్స్ విరిగిపోయాయి. మరోవైపు విభాగినిలో వేసిన చెట్లు పెద్దగా పెరిగాయి. పలు ప్రాంతాల్లో రోడ్డు కుంగడంతో వర్షపునీరు నిలిచిపోతోంది. వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నప్పుడు అద్దాలపై నీరు పడి, సమస్య నెలకొంటోంది. పలు కూడళ్లలో రాత్రివేళ దపాలు వెలగట్లేదు.

చర్యలు తీసుకుంటున్నాం

రోజూ ఎన్‌హెచ్‌పై ప్రత్యేక గస్తీ నిర్వహించడంతోపాటు, వాహనదారులకు కూడా ఎక్కడపడితే అక్కడ నిలపకుండా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలి. - ఎం.గీతారామకృష్ణ, సీఐ, తుని

తాగునీటి ట్యాంకు నిర్మాణం

తొండంగి: ఏవీనగరంలో 1.5 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ తాగునీటి ట్యాంకును అరబిందో ఫార్మా సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించింది. ఆ ట్యాంకును బుధవారం ఎమ్మెల్యే యనమల దివ్య ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ.. అరబిందో సంస్థ పరిసర గ్రామాల్లో ఉన్న 46 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆరువేల మందికి అల్పాహారం అందజేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారన్నారు. సంస్థ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మూడు చక్రాల సైకిల్ అందజేత

రౌతులపూడి: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందజేసిన మూడు చక్రాల సైకిల్‌ను బుధవారం రౌతులపూడిలో తెదేపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పైల సాంబశివ రావు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు బీజా రాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బండారు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అన్నారు. నియోజకవర్గ పర్యటనకు బుధవారం విచ్చేసిన ఆయనకు ప్రత్తిపాడులో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షుడిని ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ సత్యనారాయణతో కలిసి సన్మానించారు. ప్రజాసమస్యలపైనా, ప్రభుత్వ వైఫల్యాలపైనా ఎప్పటికపుడు స్పందించాలని సత్యానందరావు పార్టీ శ్రేణులకు సూచించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు కొత్త సత్యనారాయణ, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.


సత్యానందరావును సన్మానిస్తున్న సత్యనారాయణ, శ్రీను

నియంత్రిక ఏర్పాటును అడ్డుకున్న కాలనీవాసులు

జగ్గంపేట గ్రామీణం: రాజపూడిలో రావులమ్మ ఆలయ సమీపంలో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటుచేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈప్రదేశంలో అమర్చిన 100కెవి నియంత్రిక నుంచి ఈనెల 9న రాత్రి 10గంటల సమయంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. పాడైన నియంత్రిక స్థానంలో కొత్త నియంత్రిక ఏర్పాటు చేసేందుకు ఆశాఖ సిబ్బంది చర్యలు చేపడుతుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. విద్యుత్తుశాఖ ఎఈ మాధురి మాట్లాడుతూ పాడైన నియంత్రిక స్థానంలో కొత్తనియంత్రిక అమర్చేందుకు తీసుకొచ్చామని గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలుపుదల చేశామన్నారు. గ్రామస్థులు, అధికారుల మధ్య వారం రోజుల్లో నియంత్రిక ఏర్పాటుకు అనువైన ప్రత్యామ్నాయ స్థలానికి నియంత్రికను మార్చేందుకు అంగీకరించారు.


నియంత్రిక ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఏఈ

గ్రామాల్లో నూతన రహదారుల నిర్మాణం

గండేపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో నూతన రోడ్లకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం మురారి, గండేపల్లి, మల్లేపల్లి, సుబ్బయమ్మ పేట, ఉప్పలపాడు గ్రామాల్లో 'పల్లె పండగ'లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మురారిలో రూ.1.50 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, గండేపల్లిలో రూ.30 లక్షలు, మల్లేపల్లి రూ.40లక్షలు, సుబ్బయమ్మపేట రూ.10 లక్షలు, ఉప్పలపాడు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, నాయకులు కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, పరిమి బాబు, కుంచే రాజా, జాస్తి వసంత్ పాల్గొన్నారు.


మురారిలో రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నెహ్రూ, నాయకులు

రూ.20 కోట్ల నిధుల మంజూరు

గండేపల్లి(జగ్గంపేట), కిర్లంపూడి: ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం రాత్రి కలిసినట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు గానూ రూ.20 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకునే పేదవారు పునాదుల్లో మట్టి నింపేందుకు రుసుము లేకుండా వెసులుబాటు కల్పించమని, అదేవిధంగా ఏలేరు కాలువలో ఎడ్లబండ్లతో తెచ్చుకునే వారికి వెసులుబాటు కల్పించినట్లే, ట్రాక్టర్లకూ అనుమతులు ఇవ్వాలని, మంచినూనె ధర పెరగడంతో రాయితీపై అందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ నాలుగు నెలల వ్యవధిలో ఆరు సార్లు ముఖ్యమంత్రిని కలిసి పనులు చేయించుకుని వచ్చామన్నారు. గత పాలకులు అయిదేళ్లలో ఆరు సార్లు కూడా వారి నాయకులని కలిసి ఉండరన్నారు.

తెదేపా బూత్ ఇన్‌ఛార్జి సస్పెండ్

కిర్లంపూడి: శృంగరాయునిపాలెం 205వ బూత్ ఇన్‌ఛార్జి అల్లుమళ్ళ నారాయణరావు(బాబి)ని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు బుధవారం తెలిపారు. కిర్లంపూడిలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ.. తెదేపా విధానాలకు, పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా బాబీ వ్యవహరిస్తుండడం వల్ల క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు నారాయణరావును పార్టీ నుంచి సస్పెండ్ చేశామని చంటిబాబు తెలిపారు.

పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : గ్రామాల ప్రగతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. లింగంపర్తి, భద్రవరం, సిరిపురం, పేరవరం గ్రామాల్లో పల్లె పండుగ పేరుతో బుధవారం ఆమె పలు రహదారి నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. 'ఉపాధి' నిధులతో పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీపీ జి.బుజ్జి, కూటమి నాయకులు తమ్మయ్యబాబు, ధనేకుల వీరభద్రరావు, సంగన ప్రభూజీ, పి.నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: పల్లె పండుగతో సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. చింతలూరు, యూజేపురం, వెంకటనగరం గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ కుమార్‌బాబు తదితరులతో కలిసి గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రహదారి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ

రూ.15 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణాలు

తొండంగి, న్యూస్‌టుడే: మూడు మండలాల్లో రూ.15 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దివ్య పేర్కొన్నారు. పల్లె పండగలో భాగంగా శృంగవృక్షంలో రూ.15 లక్షలు, చోడిపల్లిపేటలో రూ.8 లక్షలతో మంజూరైన సీసీ రహదారులకు ఆమె శంకుస్థాపన చేశారు. నాయకులు యనమల రాజేష్, రామకేశవ, చొక్కా అప్పారావు, బంటుపల్లి అన్వేష్ అధికారులు పాల్గొన్నారు.

తుని గ్రామీణం: గ్రామీణాభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. 'పల్లెపండగ'లో భాగంగా ఆమె బుధవారం గరవపేట, టి.వెంకటాపురం గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారు రూ.9.12 కోట్లు వెచ్చించి గ్రామాల్లో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

చేతికందే ఎత్తులో యమపాశాలు..



జగ్గంపేట మండలం మామిడాడ నుంచి ఏలేశ్వరం వెళ్లే మార్గంలో చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం రోజూ వందలమంది రైతులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఏడాది నుంచి ఈ సమస్య నెలకొన్నా అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

గండాలు దాటి వెళ్లాలి

ప్రత్తిపాడు కిర్లంపూడి మధ్య రాకపోకలు సవాలుగా మారాయి. రహదారి ధ్వంసం అవ్వడానికి తోడు అంతుచిక్కని గోతులు చోదకులను భయపెడుతున్నాయి. ప్రత్తిపాడు సమీపంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద చెరువు నుంచి నీరు పోయే దారిలేక సమీప ర.భ. రోడ్డు ధ్వంసం అవుతుంటే, రహదారి మధ్య తూరకు రంధ్రం పడింది. దీంతో వాహనాలు ఇందులో పడకుండా అందుబాటులో ఉన్న సామగ్రిని అడ్డుగా పెట్టారు. ఈ ప్రదేశాన్ని తప్పించుకుని వెళ్తే భారీ గోతులు దాటడం సాహసమే అవుతోంది. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది జనం తిరిగే రహదారికి తగ్గట్టుగా నిర్వహణ లేదు. రోడ్డు పునర్నిర్మించేలోపు గోతులు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



జారుతోంది..జాగ్రత్త!

రోజుల తరబడి నీరు రహదారికి అడ్డంగా పారుతుండడంతో నాచు కట్టింది. వాహనాలు జారిపడుతున్నాయి. ఒమ్మంగి రాజు చెరువు సమీపంలోని శరభవరం వెళ్లే రోడ్డులో ఈ పరిస్థితి ఉంది. చెరువు నుంచి అదనపు నీరు సమీపంలోని ర.భ. రోడ్డుపై పారుతోంది. ఈయేడు మూడు నెలలుగా వర్షాలు కురుస్తుండడంతో ఈ ప్రదేశంలో తడి ఆరడం లేదు. భారీ వర్షాలపుడు ఇక్కడ 6 అడుగుల ఎత్తున నీరు పారుతుంది. గ్రామాలను కలిపే రహదారుల్లో ఇది ప్రధానమైనది. చెరువు నుంచి నీరు ప్రవహించే చోట కల్వర్టు కడితే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. -న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



అంతా గజిబిజి..



తుని రైల్వే స్టేషన్ కూడలిలో ఏ దారి ఎటుపోతుందో.. అన్నచందాన అంతా గజిబిజి నెలకొంది. నిత్యం వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రైల్వే ఫ్లైఓవర్ వంతెనతోపాటు మరో ఐదు మార్గాలకు రాకపోకలు సాగించడానికి ఇరుకైన ప్రాంగణం ఉండటంతో ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఒకేసారి బస్సులు, వ్యాన్లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వచ్చి ఆయా మార్గాల్లో వెళ్లేందుకు వాహనదారులు ప్రయత్నిస్తుండటంతో రోజూ అవస్థలు తప్పడం లేదు. ఎంతో కాలంగా ఇక్కడ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, సూచీ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని

అక్రమ మద్యం కలిగిఉన్న వ్యక్తి అరెస్టు

గండేపల్లి, న్యూస్‌టుడే: అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. వివరాలివీ.. బుధవారం ఉదయం సింగరంపాలెం గ్రామశివారున అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 9 మద్యం సీసాలు, 5 బీర్ సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేలు ఆడుతుండగా..

ఏలేశ్వరం: జె.అన్నవరం గ్రామ శివారున కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై ఎన్.రామలింగేశ్వరరావు బుధవారం తెలిపారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.640 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట గ్రామీణం: మల్లిసాలలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. గ్రామశివారున రహస్యంగా నాటుసారా తయారుచేస్తున్న ప్రాంతంలో సిబ్బందితో దాడులు చేసి తయారీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఏడుగురు జూదరులపై కేసు

రౌతులపూడి: బంగారయ్యపేట గ్రామ శివారున జూదమాడుతున్న ఏడుగురు వ్యక్తులను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వేంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,520 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

చోరులు చిక్కేనా..?

కిర్లంపూడి, న్యూస్‌టుడే : కిర్లంపూడి మండలంలో జగపతినగరం, సోమవరం గ్రామాల్లో జరిగిన వరుస దొంగతనాలకు పాల్పడ్డ అగంతకులు పోలీసులకు ఇప్పటికీ చిక్కలేదు. ఈ రెండు ఘటనలు జరిగిన తీరుచూస్తే ఇంటి దొంగల పనేనని అనుమానాలు కలుగుతున్నాయి. నెలరోజుల కిందట సోమవరం గ్రామంలో పట్టపగలు కేవలం నాలుగు గంటల వ్యవధిలో ఇంటి తాళం పగులగొట్టి రూ.పది లక్షల విలువైన బంగారం, వెండి అపహరించుకుపోయారు. దీనిపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికీ దీనిపై ఆచూకీ దొరకలేదు. ఈనెల 2న అర్ధరాత్రి జగపతినగరం గ్రామశివారు సింహాద్రిపురం జంక్షన్‌లో ఉన్న జూరాక్స్ టైల్స్ అతికించే పౌడరు తయారుచేసే కంపెనీలో పైనుంచి దిగి బీరువాలో ఉన్న రూ.8లక్షలు పైబడి నగదును అపహరించుకుపోయారు. రాత్రి పదిగంటల సమయంలో ఫ్యాక్టరీకి తాళం వేసుకు వెళ్లగా ఉదయానికి బీరువా పగులగొట్టి ఉండడం చూస్తే ఇదీ తెలిసి ఉన్నవారు చేసిన పనేనని చూసినవారు అంటున్నారు. ఈ దిశగా పోలీసులు విచారణ చేపడితే దొంగలు ఆచూకీ లభిస్తుందేమోనని బాధితులు అభిప్రాయపడుతున్నారు. వరుస చోరీలతో ప్రజలు భీతిల్లుతున్నారు.

అన్నవరంలో వివాహాల సందడి

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం దేవస్థానంలో బుధవారం రాత్రి వివాహాల సందడి నెలకొంది. సత్యగిరిపై విష్ణుసదన్, ఉచిత కల్యాణ మండపాలు, రత్నగిరిపై ఆలయ ప్రాంగణాలు, కొత్త, పాత సెంటినరీ కాటేజీలు, సీతారామసత్రం తదితర ప్రదేశాల్లో అధికంగా వివాహాలు జరిగాయి. పెళ్లి బృందాలతో ఆలయ ప్రాంగణాల్లో సందడి నెలకుంది. పెద్దసంఖ్యలో పెళ్లిళ్లు ఉండటంతో వసతి గదులకు డిమాండ్ ఏర్పడింది. అనేక మంది ఎమ్మెల్యేల నుంచి పెద్ద సంఖ్యలో సిఫార్సు లేఖలు వచ్చాయి. ఇబ్బంది లేకుండా భక్తులకు వసతిగదులను కేటాయించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని ఈవో రామచంద్రమోహన్ నియమించారు. రవాణా, దర్శనాలు, వ్రతాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

సత్యదేవుని దర్శించుకున్న చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామిని సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకట రమణారెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం గావించారు.



సర్కారీ భవనాలు పూర్తయ్యేనా..?

● వైకాపా హయాంలో ఇష్టారాజ్యం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఒకే ప్రదేశంలో రెండు సచివాలయాలు, రెండు ఆర్బీకేల నిర్మాణాలను గత ప్రభుత్వ హయాంలో రూ.1.35 కోట్ల వ్యయంతో చేపట్టారు. వీటిలో ఒక్క ఆర్బీకే తప్ప మిగిలినవి నిలిచాయి. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ఇవి కిర్లంపూడి మండల కేంద్రంలోని జగపతినగరం 4 క్లస్టర్‌లో చేపట్టారు. ఈ విధంగా జగపతినగరం పంచాయతీలో నాలుగు క్లస్టర్లకు నాలుగేసి చొప్పున సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌సెంటర్లు మంజూరు అంటే ఒక్క జగపతినగరం పంచాయతీ పరిధిలోనే భవనాలకు సుమారు రూ.3.41 కోట్లతో చేపట్టారు. వీటిలో పూర్తయినది ఒక్క ఆర్బీకేనే. ఇక్కడ ఇన్ని భవనాలు, ఇంత మంది సిబ్బంది అవసరమా అని ప్రస్తుత కూటమి ప్రభుత్వం మీమాంసలో పడింది. కిర్లంపూడి మండలంలో 19 పంచాయతీల్లో సుమారు 80వేల మంది జనాభా ఉన్నారు. వీరికోసం 26 సచివాలయాలు, 24 ఆర్బీకేలు, 20 హెల్త్ సెంటర్లను గత ప్రభుత్వంలో మంజూరు చేశారు. సచివాలయ నిర్మాణానికి రూ.43.60 లక్షలు, ఆర్బీకేకు రూ.23.94 లక్షలు, వెల్‌నెస్‌కి రూ.20.80లక్షల అంచనాలతో భవనాలు మంజూరు చేశారు. ఈ మొత్తం పూర్తికావడానికి సుమారు రూ.21.50 కోట్లు అవసరం. ఇంత పెద్ద మొత్తంలో భవనాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించే పరిస్థితి లేదు. ఒకవేళ పూర్తిచేసినా వీటి వినియోగం కూడా సమస్యగా మారనుంది.


కిర్లంపూడిలో అసంపూర్తిగా వెల్‌నెస్ సెంటరు

పూర్తయినవి అరకొర మాత్రమే

కిర్లంపూడి మండలంలో 26 సచివాలయాల మంజూరు చేస్తే 19 నిర్మాణాలు పూర్తికావచ్చాయి. నాలుగైదు చోట్ల రూ.నాలుగైదు లక్షలు వెచ్చిస్తే పనులు పూర్తవుతాయి. మరో ఏడు భవనాలు అయితే సగంలో నిలిచాయి. ఆర్బీకేల నిర్మాణాల సంగతి సరేసరి. 24 భవనాలు మంజూరుకాగా 8మాత్రమే పూర్తయ్యాయి. హెల్త్ సెంటర్ల పరిస్థితి దారుణం. 20 భవనాలు మంజూరైతే ఐదు భవనాలు ఇప్పటికీ ప్రారంభమే కాలేదు. 14 సెంటర్ల పనులు వివిధ దశల్లో నిలిచాయి. జగ్గంపేట నియోజకవర్గంలో కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలాల్లో ఇదే పరిస్థితి. నాలుగు మండలాల్లో మంజూరైన మొత్తం 280 భవనాలు పూర్తి చేయాలంటే సుమారు రూ.90 కోట్ల నిధులు అవసరం. వీటిలో పూర్తయిన వాటికి సంబంధించి సుమారు రూ.25కోట్ల వరకు ఖర్చు చేశారు. వీటిలో గుత్తేదారులకు సుమారు రూ.10 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ కారణంగానే పనులు నిలిచాయి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో చేపట్టిన ఈ భవనాల నిర్మాణం ప్రస్తుత ప్రభుత్వానికి గుదిబండలా మారింది.


జగపతినగరంలో పునాది దాటని ఆర్బీకే

ఉన్నతాధికారులకు నివేదించాం

నియోజకవర్గంలోని గ్రామాల్లో గత ప్రభుత్వంలో చేపట్టిన భవనాలు, పూర్తయినవి, పూర్తి కావాల్సిన వాటి వివరాలను అధికారులకు నివేదించాం. వాటి నిర్మాణాలకు నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **ఉమాశంకర్, డీఈఈ, పంచాయతీరాజ్, జగ్గంపేట**

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

రౌతులపూడి: సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు అన్నారు. గిడజాం గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించవద్దని తెలిపారు. ఎస్సై జి.వెంకటేశ్వరరావు, ఏఎస్సై రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహిద్దాం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రత్యేక ప్రతిభావంతులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అందిస్తే వారు తోటివారితో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తారని ఎంఈవో గీతాదేవి సూచించారు. డిస్లెక్సియా అవగాహన మాసోత్సవం సందర్భంగా తేటగుంట జడ్పీ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. హెచ్ఎం విశాలి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత సాగుతో లాభాలు

శంఖవరం, రౌతులపూడి, న్యూస్‌టుడే: సమీకృత వ్యవసాయంతో రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. కత్తిపూడిలో 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సమీకృత వ్యవసాయంతో పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. ఏడీఏ బుల్లిబాబు, ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్, సహాయ సిబ్బంది ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఏవో విజయ్‌కుమార్

● రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ సూచించారు. రౌతులపూడి మండల వ్యవసాయాధికారి ఈశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం బలరాంపురంలో 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచి పైల సీత, ఎంపీటీసీ సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

తుని గ్రామీణం: రైతులు ముందస్తుగా చేపట్టే సస్యరక్షణ చర్యలతో వరి పంటలో తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది బుధవారం రాజుపేట, ఎస్.అన్నవరం గ్రామాల్లో రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు.

గండేపల్లి: ప్రస్తుతం మినుము పంటలో మారుకమచ్చ పురుగు నష్టం కలుగజేస్తుందని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. బుధవారం యల్లమిల్లిలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.